# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ : (0863) 2293280, 2293206
web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
గూడూరి వెంకటరత్నం
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి
మిస్.పి. ఇందిరాదేవి
డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు
డా॥ యమ్.స్వర్ణముఖి

Volume 30 Issue 8
No.of Pages 40
APRIL 2011

| | | |
|---|---|---|
| 5సం॥లచందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్సుA/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్స్ పంపవలసిన చిరునామా:
మేనేజరు
సమర్థసద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by
C.V. Ramana Babu,
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Samardha Sadguru Publications,
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, and
published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh. Editor -
DUGGIRALA JAGANMOHANA BALA
KRISHNA LAL

**ఈ సంచికలో....** **పేజీ**

| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మ ఆశీస్సులు | 3 |
| సంపాదకీయం | 4 |
| బాబూజీ ఉవాచ | 6 |
| మాతాజీ అభిభాషణ | 9 |
| సన్నిధిలో సంభాషణ | 11 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 14 |
| చండికేశ్వరుడు | 15 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 18 |
| బెంగుళూరులో శ్రీమాతాజీ | 20 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 22 |
| సమర్థ సద్గురు నాధుని దివ్యచరిత్ర | 25 |
| గిరిజా విజయం | 27 |
| మన సాధన ఎందుకు ఫలించటంలేదు? | 30 |
| కన్నుమూస్తే | 32 |
| నేను అర్థం చేసుకున్న భక్తియోగం | 34 |
| సమర్థ సద్గురు యాజమాన్యం వివరాలు | 37 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 38 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః ।
కామః క్రోధ స్తదాలోభ స్తస్మాదేతత్త్రయం త్యజేత్ ॥
(భ.16 - శ్లో. 21)

కామ, క్రోధ, లోభాలు మూడు నరకద్వారాలు. ఈ గుణాలకు లోబడితే నరక ప్రాప్తి తథ్యం. చూచిన దాన్ని వాంఛించటమే కామము. అది అలభ్యమయితే కలిగే వికారమే క్రోధం. లభిస్తే ఆ వస్తువును స్వంతం చేసుకుని, అన్యులకు దానిని పొందే అవకాశం, అనుభవం, అధికారం లేకుండా చేయటమే లోభం.

ధర్మబద్ధమైన కోరిక భగవత్స్వరూపమే. ఒకపేదవాడికి బంగారు నాణాల మూట లభించింది. ఆ మూటలో తొంభై నాణాలే ఉన్నాయి. నూరు నాణాలు ఉంటే బాగుండు అనే అసంతృప్తి ఏర్పడింది. ఎలాగైనా నూరు నాణాలు చేయాలనే దృఢమైన కోర్కె జనించింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కష్టపడుతున్నాడు. శరీర శ్రమ ఎక్కువైంది. మనస్సులో ఆందోళన, అసంతృప్తి. నిదుర పట్టదు. దొంగలు ఎత్తుకుపోతారేమోనన్న భయం. చూశారా! మనస్సులో జనించిన కోరికవాడి జీవితానికి నరకమే కదా!

తాను అనుకున్నది సాధించలేనప్పుడు జనించేది క్రోధం. దాని ద్వారా మనుష్యత్వం నశిస్తుంది. అటువంటి వ్యక్తికి బంధుత్వము, స్నేహము, అనురాగాలు, ఆస్తులు, అంతస్తులు అన్నీ సర్వనాశనమే.

లోభం ఇంకా చెడ్డది. లోభి తనకి లభించినదాన్ని తాను అనుభవించడు ఇతరులకు అందనివ్వడు. గడ్డివాము ప్రక్కన పడుకున్న కుక్క తాను గడ్డి తినదు. తినటానికి దూడవస్తే మొరిగి దానిని తరుముతుంది.

త్యాగికి పెడితే ఆనందం. భోగికి తింటే ఆనందం. లోభికి ఉంటే ఆనందం. కామక్రోధాది గుణాలు మానవులకు సుఖాన్ని దూరం చేస్తున్నాయి. **'న సుఖం న పరాం గతిం'** అన్నది సత్యమే కదా! *

# అమ్మ ఆశీస్సులు

**శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం**
**సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపం**
**ఆజానుబాహుం అరవిందదళాయతాక్షం**
**రామం నిశాచర వినాశకరం నమామి ॥**

శ్రీసద్గురుదేవుల దివ్య అనుగ్రముతో నూతన సంవత్సరములో అడుగు పెట్టి కాలమునకు ఖరము పేరైనది.

**కాలోఽస్మి లోకక్షయ కృత్ప్రవృద్ధః**
**లోకాన్సమాహర్తుమిహ ప్రవృత్తః**

శ్రీజగద్గురుదేవుని మాట. ఎన్ని కష్టములను తనలో నింపుకుంటూ సుఖమును గుర్తింపజేస్తున్నారో అది ప్రతి భక్తునికి అనుభవమైనది. సర్వకాల సర్వ అవస్థల యందు శ్రీభగవంతుని తలపులో ఉండటమే మనకు శ్రేయమైనది. శ్రీసద్గురుదేవులు తరచు చెపుతూ ఉండేవారు "నీ మనస్సు భగవంతుని చరణార విందాలయందు ఉన్నాసరే, భగవంతుడు నీ మనస్సు యందు ఉన్నాసరే, ఇక వేరే జపతములేల?" మనం భగవంతునిలో ఉన్నాము.

శ్రీరామనవమి వచ్చినది. శ్రీసీతారామ కళ్యాణమన్నా, జీవబ్రహ్మైక్యము అన్నా జగన్మాత శక్తియే. రావణాసురుని వంటి వాడెంత వాడైనా అమ్మ సీతమ్మ తలచుకుంటే అంతంచేయగలదు. కాని తన ప్రభువు శ్రీరామచంద్రునికే వదిలిపెట్టింది. సుందరాకాండలో ఆంజనేయస్వామితో అమ్మ అంటుంది "కాకాసురుని మీద బ్రహ్మాస్త్రము విడిచిపెట్టినాడే, మరి రావణాసురుడి విషయములో ఎందుకు అలా ఊరకున్నాడు?" అని పూర్వపు సన్నివేశమును గుర్తుకు తెచ్చినది మన తల్లి.

ఏ ధర్మమును ఎవరు ఏ విధముగా ఆచరించాలో తెలియజేస్తుంది శ్రీరామాయణగాథ.

ఇలా కాలగమనంలో మన జీవితమును ఎంతో సంతృప్తితో శ్రీగురుదేవులు నడిపిస్తున్నారు. అట్టి శ్రీగురుదేవునికి నమస్కరిస్తూ అట్టి భక్తిని, శక్తిని, మనకందరికీ ప్రసాదించుగాక!

-మీ అమ్మ

# సంపాదకీయం

-పరాశర ప్రసాద్

మాఘ మాసంలో వచ్చే బహుళ చతుర్దశి భారతీయ సంస్కృతీ సంప్రదాయాలలో అత్యంత పవిత్ర పుణ్యదినం, మహాశివరాత్రి. పార్వతీ పరమేశ్వరులిరువురికి అత్యంత ప్రీతికరమైన ఈ పర్వదినాన భక్తులంతా అభిషేకాలు, పూజలు, ఉపవాసాలు, జాగరణ, శివారాధనలో గడుపుతారు.

భక్తులంతా పార్వతీపరమేశ్వరులను ఆరాధించుకోవటానికి ఆవకాశం కల్పించినట్లుగా మాఘ బహుళ చతుర్దశినాడు సృష్టి, స్థితి, కర్తలయిన బ్రహ్మ విష్ణువుల మధ్య సృష్టికార్యం గొప్పదా లేక దాని పోషణ భారం వహించటం గొప్పదా అన్న విషయం మీద వాదులాట జరిగిన సందర్భంలో ఓంకార నాదం ప్రతిధ్వనిస్తూ వారి ఎదురుగా ఒక అగ్ని జ్వాలా స్థంభం ఆవిర్భవించింది. దానిని చూసి ఇరువురూ ఆశ్చర్యపోయారు.

"ఈ స్థంభం తుది, మొదలు ఎవరు కనుక్కుంటారో వారే అధికులు" అని నిశ్చయించుకుందాం అనుకుని, హంస రూపం దాల్చి బ్రహ్మ, వరాహ రూపం దాల్చి విష్ణువు, ఒకరు స్థంభం పైకి, మరొకరు స్థంభం క్రిందికి వెళ్ళారు. తుది, మొదలు కనుక్కోలేకపోయారు. విష్ణువు యదాస్థానానికి వచ్చి, బ్రహ్మకోసం నిరీక్షిస్తున్నాడు. వెను దిరిగి వచ్చే బ్రహ్మకు ఒక మొగలి పువ్వు కనిపించింది. వెంటనే ఆ పువ్వును "నువ్వు ఎక్కడి నుంచి వస్తున్నావు?" అని ప్రశ్నించాడు. పువ్వు సమాధానం చెబుతూ తాను స్థంభం పైభాగాన్నుంచి జారి క్రిందికి వస్తున్నాను అని చెప్పింది. అప్పుడు బ్రహ్మ తాను చెప్పేమాటకు సాక్ష్యం ఉండవలసినది కోరగా వెంటనే మొగలి పువ్వు అంగీకరించింది. బ్రహ్మ మొగలిపువ్వుతోపాటుగా యదాస్థానానికి చేరి, విష్ణుమూర్తితో తాను అగ్నిస్థంభం యొక్క మొదలు చూశానని, అందుకు మొగలి పువ్వే సాక్ష్యమని చెప్పి నమ్మించాడు.

అగ్ని స్థంభం నుంచి పరమేశ్వరుడు ప్రత్యక్షమై, అసత్యం పలికిన బ్రహ్మ శిరస్సును ఖండించాడు. అందువలన బ్రహ్మ చతుర్ముఖుడయ్యాడు. అంతేకాదు మొగలి పువ్వు శివార్చనకు పనికిరాదని శాపమిచ్చాడు. బ్రహ్మ, విష్ణువులు పరమేశ్వరుని విశిష్ఠతను తెలియజేసిన రాత్రే మహాశివరాత్రి పర్వదినంగా ప్రసిద్ధికెక్కింది.

మహాశివరాత్రి పర్వదినాన కాళీవనాశ్రమంలో వేకువజామునే సర్వదేవతా స్వరూపుడైన శ్రీగురు మూర్తికి బృందావనంలో లఘున్యాస పూర్వకంగా సామూహిక అభిషేకాలతో ప్రారంభమై, సద్గురుదేవులు తమ శక్తినంతా ధారపోసి, ప్రతిష్ఠించిన శ్రీరామలింగేశ్వరునికి సహస్రఘటాభిషేకం, లక్షబిల్వార్చన అనంతరం శ్రీఉమారామలింగేశ్వరుల లీలాకళ్యాణంతో ఆనాటి కార్యక్రమాలు ముగిసి భక్తులందరికీ ఆనందాన్ని కలిగించాయి. శ్రీమాతాజీ మహాశివరాత్రి విశిష్ఠతను గూర్చి సత్సంగ సమావేశంలో భక్తులకు ఉద్బోధించారు.

-పరాశర ప్రసాద్

(గౌరవ సంపాదకుడు)

## శ్రీకృష్ణుడు నా మనస్సును పూర్తిగా ఆక్రమించాడు

మీరాబాయి శ్రీకృష్ణభక్తురాలు. చిన్ననాటి నుంచీ ఆమె హృదయం ఆయనకే అంకితం చేసింది. వివాహమైన తరువాత కూడా శ్రీకృష్ణ నామగానం, పూజ సతతం చేయటం మానలేదు. శ్రీకృష్ణ సాక్షాత్కారం కోసం కృశించి, తపించిపోతూ ప్రాపంచిక విషయాలలో ఆసక్తి చూపేదికాదు.

మహారాజ వంశానికి చెందిన మీరాబాయిని ఉదయపూర్ మహారాజు వివాహం చేసుకున్నాడు. రాజాంతఃపురంలో కొందరికీ, ఆమె ఆడపడుచులకూ, మీరాబాయి భక్తి విశ్వాసాలంటే గిట్టక నానా చిత్రహింసలు పెట్టేవారు. కాని భర్తమాత్రం ఆమెను అతి ప్రేమగా చూసేవాడు.

ఒకనాడు ఆమె భర్త వచ్చి 'నీభర్తగా నీ ప్రేమానురాగాలు పొందే హక్కు నాకు ఉంది. ఎప్పుడు నీ దగ్గరకు వచ్చినా భక్తి తన్మయత్వంతో ఉంటావు. మాట్లాడటానికే వ్యవధి దొరకదు. నీ ప్రేమ కొంచెమైనా నా మీద చూపాలని మనసారా కోరుతున్నాను. నీ ఉద్దేశం ఏమిటి' అని ప్రశ్నించాడు.

'స్వామీ! మీరు చెప్పింది పరమ సత్యం. మీ భార్యగా మిమ్మల్ని ప్రేమించి సేవించాలన్నది నిజం. కాని నేను అసహాయను. చిన్ననాడే నా హృదయంలో చోటుచేసుకున్న కృష్ణుడు నా హృదయాన్ని దోచుకున్నాడు. ఆయన నా మనస్సును ఎంతగా ఆక్రమించాడంటే మీకు ఇక్కడ చోటు లేకుండా చేశాడు. నేను నిస్సహాయను. మిమ్మన్ని ప్రేమించాలని ప్రయత్నించీ అలా చేయలేకపోతున్నాను. నా నిస్సహాయ స్థితిని మీరు గ్రహించి, దయతో నన్ను క్షమించమని ప్రార్థన' అని మీరాబాయి సవినయంగా భర్తకు విన్నవించింది.

- స్వామి రామదాసు

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

మానవుడు ధనంతో అన్ని సుఖాలూ పొందవచ్చుననుకుంటాడు. అందుకని అక్రమ మార్గంలో అయినా సరే ధనార్జన కోసం ప్రయత్నం చేస్తాడు. అందుకోసమై ఎన్నో అసత్యాలు పలకటానికి, అన్యాయాలు చేయటానికి, హింసకు కూడా వెనుదీయడు. తత్ఫలితంగా ఎన్నో నీచయోనులలో జన్మలెత్తుతూ, పునరపి జననం, పునరపి మరణం అని కాలచక్రంలో పడి తిరుగుతూ ఉంటాడు. వితండ వాదులు "మళ్ళీ జన్మలేదు; ఏదీ లేదు, ఈ శరీరం ఉన్నపుడే దీనితో అన్ని సుఖాలూ అనుభవించాలి" అంటారు. అది తప్పు. పునర్జన్మ ఉన్నది. తపస్సు ద్వారా, ధ్యానం ద్వారా, మన భారతీయ మహర్షులు పూర్వజన్మ వృత్తాంతాలను, భావిజన్మలను గూర్చి కూడా స్పష్టంగా దర్శించగలిగారు.



కాని యిప్పుడిప్పుడే హేతువాదులు కూడా, కనిపిస్తున్న దృష్టాంతాలను బట్టి పునర్జన్మ ఉన్నదని అంగీకరిస్తున్నారు. అలాగే తపశ్శక్తి ద్వారా మహర్షులు భూలోకంలోనే గాక యితర లోకాలకు, ఎక్కడికైనా వెళ్ళటానికీ, ఎక్కడి దృశ్యాన్నయినా చూడటానికీ, ఎక్కడి శబ్దాన్నయినా వినటానికి, మన మనస్సులో మెదిలే భావాలను కూడా గ్రహించటానికి శక్తి కలిగి ఉండేవారు. ఆత్మశక్తి ద్వారా పూర్వం మన మహర్షులు సాధించిన ఆ శక్తులనే యిప్పుడిప్పుడు మానవుడు ఎన్నో శ్రమల కోర్చి, ఎంతో ధనవ్యయం చేసి, విజ్ఞాన శాస్త్రం ద్వారా యీ శక్తులను కొద్ది కొద్దిగా పొందటం నేర్చుకుంటున్నాడు. ఇప్పుడు టెలివిజన్ ద్వారా దూరదృష్టి, దూరశ్రవణము కొంతవరకు మానవుడు సాధించాడు. ఎన్నో మైళ్ళ దూరంలో ఉన్నా, అమెరికాలో జరిగే సంఘటన టెలివిజన్‌లో చూసినప్పుడు మన యింట్లోనే జరిగినట్లుంటుంది. అక్కడ వెలువడిన శబ్దం యిక్కడే మన ఎదుటనే మాట్లాడినట్లు వినబడుతుంది.

కేవలం తపోధ్యానాదుల ద్వారా అటువంటి మహత్తర శక్తులను పొందినవారు అప్పుడూ ఉన్నారు, ఇప్పుడూ ఉన్నారు. నిజానికి ఆత్మజ్ఞానం ముందు ఈ శక్తులన్నీ సూర్యుని ముందు దివిటీల వంటివి. అటువంటి

ఆత్మజ్ఞాన సంపదను పుష్కలంగా అనుభవిస్తున్న మహనీయులు యిప్పుడూ ఉన్నారు. అయినా ప్రజలు వారిని గుర్తించలేరు. అభాండాలు మాత్రం వేస్తారు. తనకంటె ఏ విషయంలోనైనా ఎదటివాడు కొంచెం అధికమైనవాడు అని తెలిస్తేనే ఓర్వలేకపోవటం, అసూయపడటం, ద్వేషించటం మానవ నైజం. అయినా అటువంటి వారి యందు కూడా దయ చూపటం, వారిని సన్మార్గంలోకి మార్చే ప్రయత్నం చేయటం మహాత్ముల సహజ గుణం.

నాలుగు వీధుల కూడలిలో వెలిగించే దీపం వంటివారు మహాత్ములు. ఆ దీపం అందరికి సమానంగానే కాంతినిస్తుంది. ఆ వెలుగులో ఒకరు భగవద్గీత చదువుతుంటే మరొకరు పేకాట ఆడుతారు. ఒకడు రామకోటి వ్రాస్తుంటే మరొకడు ఫోర్జరీపత్రాలు వ్రాస్తాడు. ఆ దీపం అన్నిటికి సాక్షిగానే ఉంటుంది గాని ఎవరి ఫలితాలు వారే పొందుతారు. అలాగే భగవానుని ప్రేమ, మహాత్ముల కరుణ అందరిపైన సమానంగానే ఉంటుంది. దానిని దుర్వినియోగం చేసిన వారు దుర్గతి పాలవుతారు. సద్వినియోగం చేసినవారు సద్గతి పొందుతారు. గరికను మేసిన గాడిదే పోతుంది గాని గరిక ఎప్పుడూ చిగురిస్తూనే ఉంటుంది.

అవ్యాజ కరుణామయుడు భగవానుడు. తనను తలుచుకుంటే చాలు, లక్ష్మీ సహితంగా హృదయంలో నిలిచి సర్వదా కాపాడుతాడు. అలా లక్ష్మీ నారాయణులు నిలిచిన మలిన మనస్సు శుద్ధ మనస్సుగా మారిపోతుంది. కామక్రోధాదులు ఉత్పన్నం కావటానికీ, అజ్ఞాన బంధన కలగటానికీ, దుష్ప్రవర్తనకు దిగి అధోగతి పాలు కావటానికీ అక్కడ అవకాశమే లేదు. సుఖదుఃఖములకు అతీతమైన పరమశాంతి లభిస్తుంది. ఇహంలో లక్ష్మీదేవి ధన దారిద్ర్యాన్ని హరించి, భోగభాగ్యాలను అందిస్తుంది. పరంలో నారాయణుడు అజ్ఞాన దారిద్ర్యాన్ని హరించి మోక్ష సామ్రాజ్యాధిపత్యమే ప్రసాదిస్తాడు. ఇలా ఇహపరాలు రెంటిలోను లోటులేని ఐశ్వర్యం పెట్టుబడి లేకుండానే లభిస్తుంది.

ఏమీ fees (ప్రతిఫలం)కోరకుండానే భగవానుడు మనకు యీ ఉపకారం చేస్తాడు. అందరు డాక్టర్ల కంటె గొప్ప వైద్యుడు భగవానుడు. ఎవరూ కుదర్చలేని భవరోగాన్ని హరించగల ఔషధం ఆయన వద్ద ఉంది. దానికి ఖర్చు లేదు. ఉచితం. చేదులేనిది, కమ్మనిది అయిన, ఆయన నామమే ఆ దివ్యౌషధము, ఔషధము సేవించిన వారు రోగ విముక్తులవుతారు.

సుఖశాంతులతో వర్ధిల్లుతారు. సేవించని వారు రోగపీడితులై బాధపడుతూనే ఉంటారు. "ధ్యానం ఎంతసేపు చెయ్యాలి" అని అడుగుతారు. మనోలయం అయ్యేవరకు ధ్యానం చెయ్యాలి. అంతరింద్రియములు భగవానుని యందు నిలబడి లయించిపోవాలి. ధ్యాన హోమంలో గుణాలు, సంకల్పాలు ఆహుతి అయితే మనస్సు శుద్ధమై భగవానుని దివ్య చరణారవిందముల యందు నిలిచి లయించి పోతుంది. మనస్సుకు assistant లు (సహాయకులు) అయిన బుద్ధి, చిత్తము, అహంకారము కూడా భగవానుని యందే లయించి పోతాయి. అపుడు అంతులేని శాంతి మన సొమ్ము అవుతుంది. భగవానుడైన గీతాచార్యుడు అందించిన గీతాసందేశ సారము ఇదే.

అట్టి భగవానుని మరచి పోవటం వలన, మానవులు బాధలకు, దుఃఖానికి గురి అవుతూ, శ్లేష్మంలో పడిన ఈగలాగా కొట్టుకుంటున్నారు. శ్లేష్మాన్ని పూర్తిగా హరించి వేసేది శ్లేష్మాంతక రసము; అంటే తులసి రసము. అలాగే అజ్ఞానమనే శ్లేష్మాన్ని హరించే దివ్యౌషధం తులసీదళ ధాముని దివ్యనామ రసము. అందుకే "పిబరే రామరసం! జనన మరణ భయశోక విదూరం" అని శ్రీసదాశివ బ్రహ్మేంద్రులు అన్నారు. ఆ దివ్య నామ రసం ముని మనోవృత్తులను హరించటమే కాదు; మలిన మనస్సులను కూడా శుద్ధ మనసులుగా మార్చగలుగుతుంది.

అలా మలిన మనస్కులైన మానవులను కూడా శుద్ధ మనస్కులుగా తయారు చేసి మానవకోటిని ఉద్ధరించాలని, వారికి సుఖశాంతులను ప్రసాదించాలనే కరుణతో భగవానుడు శ్రీకృష్ణపరమాత్మగా ఉద్భవించాడు. ఆయనది నవమాసాలు గర్భనరకం అనుభవించిన మానవ జన్మ కాదు. అప్పటికప్పుడే జరిగిన ఆవిర్భావము. కనుకనే చతుర్భుజాలతో, శంఖ చక్ర గదా పద్మాలతో కౌస్తుభ మణిహారంతో శ్రీనారాయణ మూర్తిగా దేవకీ వసుదేవులకు ముందుగానే దర్శనమిచ్చి, తన అవతార ప్రయోజనాన్ని వారికి వివరించి, తక్షణ కర్తవ్యం బోధించి, వెంటనే పొత్తిళ్ళలో పసిబాలుడుగా మారి, దేవకీ దేవి ఒడిలో ఒదిగిపోయాడు. ఆ క్షణంలోనే దేవకీ వసుదేవులకు సంకెళ్ళ నుండి బంధ విముక్తి అవటమే గాక, భవబంధ విముక్తి కూడా లభించింది. ఆ రాజ దంపతుల రాజ్యము, సైన్యము, సంపదలు, బలము వారికి ఆ విముక్తిని యివ్వలేక పోయినవి. అది ప్రసాదించే శక్తి భగవానునికి మాత్రమే ఉంది.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

ఇటువంటప్పుడే ఎంతో జాగ్రత్తగా మసలుకోవాలి. శాశ్వత నిద్ర అంటే చావు. అందులోకే గాని మనం జారుకుంటే అక్కడనుండి మనని లేపేవారెవరూ వుండరు సరికదా, ఎవరైనా లేపినా మనం లేవం! సరయిన టైముకి లేవాలి. దైవప్రార్థన, దైవధ్యానం చేసుకోవాలి. ఇవే మన వెంటవచ్చేవి. ఇవే మన జీవితానికి శక్తి (Power) నిచ్చేవి; మనకి నిజమైన ఆత్మ బలాన్నిచ్చేవి. మహాత్ములుపదేశించిన మార్గం పెడచెవిన బెట్టి, యింతకు ముందు మనం చెప్పుకుంటున్న ఉద్యోగస్తుడిలాంటి వారు కాలాన్ని ఆ విధంగా వ్యర్థం చేసుకుంటున్నారు.



సరే, అతడు ఆదివారం మధ్యాహ్నం వరకూ ఎలాగో ఒకలాగ గడుపుతాడు. ఇక సాయంత్రం అయ్యేసరికి బోరుకొడుతోందంటాడు. అప్పుడతని భార్య "బోరేమిటండీ, అలా బయటకి వెళ్లి వద్దాం" అంటుంది. మంచి తల్లులుంటే ఏ గుడికో, సత్సంగ సమావేశానికో తీసుకెళ్తారు. ప్రపంచ తల్లులుంటే సినిమాకి తీసుకెళతారు. అయితే ఆ గట్టు, లేకపోతే ఈ గట్టు. ఆ గట్టుకి వెళ్తే ఆనందం. ఈ గట్టుకి వెళ్తే ఆనందంలాగా వుంటుంది కానీ, ఏడుపులు, తలనొప్పి మిగులుతాయి.

ఈ సినిమాలన్నీ ఎప్పుడు రక్తి కడుతున్నాయి? మన జీవితంలో జరిగే సంఘటనల్లాంటివే చూపెడితే అది రక్తి కడుతోంది. లేని కథని సృష్టించి, వాళ్లు చూపెడుతూ వుంటే వెర్రితలకాయలేసుకుని ఆ సినిమాని చూస్తున్నారు! టైముని 'నిత్యకాలం' లో జమచేసుకోమన్నారుగానీ, ఇలా వ్యర్థం చేసుకోమన్నారా?

మహాత్ముల సందర్శన, స్పర్శన, సంభాషణ, వందనాది కార్యక్రమాలలో జన్మను పునీతం చేసుకున్న కాలం 'నిత్యకాలం'లో

జమవుతుంది. మహాత్ములు ప్రత్యక్ష పరమేశ్వరులు. వారి సాంగత్యాన్ని మనం ఎంతవరకూ సద్వినియోగం చేసుకుంటున్నాము? మనకి సత్య వస్తువును చేరే మార్గాన్ని చూపెడుతున్న మహనీయులు కదా! ఎంతవరకూ వారు చెప్పిన బాటలో నడుచుకోగలుగుతున్నాము?

అందుకే అన్నమయ్య ప్రార్థిస్తున్నారు."ప్రభూ! యీ పాపపు మనస్సు ఈ రసములలో ఎందైనా పడిపోవచ్చు. ఇదంతా నీ లీలయ్యా! ఈ లీలల్లో పెట్టి, ప్రపంచంలోకి త్రోసి, ఈ మనస్సనే మాయను పెట్టి, ఎంత సృష్టిస్తున్నావయ్యా నువ్వు! నీకు లీల మాకు గోల! ఈ బొమ్మలతో ఏమి ఆటలు ఆడుకుంటున్నావయ్యా! నిన్నాశ్రయించి ఉండలేక, ఈ మనస్సు తపా తపా కొట్టుకుంటోందే! అందుకని యీ సృష్టి అంతా నీ లీలే! అని, నీ మయమేననీ గుర్తించేటట్టు చేయవయ్యా!" అని ప్రార్థించాడాయన.

ఈ సృష్టి అంతా భగవంతుడి నుంచే వచ్చింది. అది గుర్తించక మానవుడు 'ఇదంతా నాది' అని అనుకుంటూ 'నాది-నేను' అనేది కొండలాగా పెంచేసుకుంటున్నాడు. **మయ్యేవ సకలమ్ జాతమ్, మయి సర్వమ్ ప్రతిష్ఠితమ్, మయి సర్వమ్ లయమ్ యాతి। తద్ బ్రహ్మ। అద్వయమస్మ్యహమ్ ।** అని చెప్తోంది కైవల్యోపనిషత్తు. అంటే ఈ సమస్త సృష్టి నా యందే పుడుతోంది, నా యందే ప్రతిష్ఠమై ఉంటోంది, నాలోనే లయిస్తోంది. దానినే బ్రహ్మ అంటారు. అది రెండవది లేనిది. (అద్వయం). అది 'నేను' అయి ఉన్నాను అని దాని అర్థం.

దానిని గుర్తించినవారికి 'నేను' అనేది అద్వైతమైన బ్రహ్మవస్తువుగా గోచరమవుతుంది. ఆ బ్రహ్మ వస్తువు 'తాను' అని గుర్తించినవారు ద్వైతం లేని ఏకత్వమైన బ్రహ్మానుభూతిని పొంద గలుగుతున్నారు. కానీ దానిని ఎవరూ గుర్తించటంలేదు. అందుకనే ఈ కీర్తన మొదట్లో అన్నమయ్య ఏమన్నారంటే "హరి నీవే సర్వాత్మకుడవు (అని) స్థిరమగు భావన నీయగదే. 'ప్రభూ! నీవు సర్వాత్మకుడవు. ఇక్కడ ఉండి అక్కడ లేకపోవటమనేది లేదయ్యా. ఉన్నదే నువ్వయ్యా ఆ సత్యాన్ని నేను గుర్తించేటట్లు చేయవయ్యా!" అని ప్రార్థించాడు ఆయన.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

గురుదేవుడు మాట్లాడుతూ అదే నాయనా నేను చెప్పేది. ఈ దేహం జడము. దీనిని ప్రకాశింప జేయటానికి శక్తి కావాలి. అదే ప్రజ్ఞానం బ్రహ్మ అంటారు. అదే ఏకమేవ అద్వితీయం బ్రహ్మ అంటే. అని అనగానే శిష్యుడు వెంటనే గురువుగారూ! ఇందాక మీరు రెండు చెవులు కలిసి ఒక్కటే అన్నారు అదేనాండీ అన్నాడు. ఈ మూర్ఖుణ్ణి ఆ లక్ష్యార్థమే కాపాడాలి అనుకున్నాడా గురువుగారు.

ఇంకా మాట్లాడుతూ రెండు చెవులు కలిసి ఒక్కటి అవ్వటం కాదు ఇంద్రియ దృష్టి, దేహ దృష్టి తొలగిపోతుంది అని చెప్పి శిష్యుని చెవిలో తారక నామాన్ని ఉపదేశించి, దీనియందే సదా నీ మనస్సు నిలిపి ధ్యానించు. అప్పుడు గుణములన్నీ సుగుణములుగా మారి నీకు శాంతిని ఆనందాన్ని ప్రసాదిస్తుంది అన్నారు.

శిష్యుడు ఆలోచించటం మొదలుపెట్టాడు. రామరామ అని అనకుంటున్నాను కదా! ఉపదేశం అంటే ఏమిటో అనుకున్నాను. ఇంతేనా ఈ నామం నేను చాలాసార్లు విన్నదేనే అని మనస్సులోని భావాన్ని ఆచార్యదేవునికి విన్నవించాడు. గురువుగారు మాట్లాడుతూ అలా ఎన్నడూ భావించవద్దు నాయనా అలా అయితే దాని ద్వారా వచ్చే శక్తి ఎన్నడూ అందుకోలేవు. నువ్వు చేసే ధ్యాన ఫలితం నీకు దక్కాలంటే విశ్వాసంతో ధ్యానించాలి. అది నీకు తప్పక సుఖశాంతులను ప్రసాదిస్తుంది అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ చూశారా! లక్ష్యార్థాన్ని స్వీకరించేవరకు ఉన్న ఆవేదన తరువాత ఎంతవరకు చూపగలుగుతారు?

**25-5-1985**

శ్రీబాబు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ లక్ష్యార్థాన్ని స్వీకరించిన శిష్యుడు గురువుగారిని ప్రశ్నిస్తూ 'నేను లక్ష్యార్థాన్ని స్వీకరించాను కదా! తల బోడప్పనం చేయించుకోవాలాండీ?' అని అడిగాడు. ఆచార్యదేవుడు సమాధానం చెబుతూ నాయనా! బోప్పనం అవ్వవలసినది మనస్సు. తల బోప్పనం అయినంత మాత్రాన ఏం లాభం? అని అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ నాకూ ఉన్నారు ఇటువంటి శిష్యులు. ఇటువంటి డిస్కషన్ ఇక్కడ కూర్చున్న పండితునికి ఆయన భార్యకి జరిగింది. ఈ పండితుడు పాపం! తల బోడి చేయించుకున్నాడు. ఇందులో నా ప్రమేయం ఏమీ లేదు. ఆయనే స్వచ్ఛందంగా చేయించుకున్నాడు. ఆయన భార్యకి పాపం ఇష్టం లేదనుకుంటాను. అందువలననే భర్తను ప్రశ్నిస్తే 'బాబుగారు మనస్సు బోడి అవ్వాలికాని, తల బోడి అయితే ఏం లాభం అన్నారు కదా! మరి ఆయన చెప్పినదాన్ని ఆచరించక తల బోడి ఎందుకండీ చేయించుకోవటం? అన్నది. ఈ సంభాషణ జరిగినది యదార్థమో కాదో వారినే అడిగి తెలుసుకోండి. ఈ బాబు ఎన్నడూ అసత్యం ఆడడు. నేను అక్కడనే వారిద్దరి మధ్య ఉన్నాను. కాని వారికి నేను కనబడలేదు. కనబడను. అది వారు గ్రహిస్తే ఇంక తెలుసుకోవలసినది లేదు అన్నారు.

ఇంకా మాట్లాడుతూ గురుశిష్యుల ఉదంతం మధ్యలో ఆగిపోయింది కదా! దానిని గురించి తెలుసుకుందాం. ఆచార్యదేవుడు లక్ష్యార్థాన్ని ప్రసాదించిన తరువాత శిష్యుడిని ఉద్దేశించి నాయనా మీ నాన్నగారు అమ్మగారు ఎలా చనిపోయారో నువ్వు చూశావు కదా! అటువంటి మృత్యువు నువ్వు పొందవు. నువ్వు బ్రతికి ఉండగానే చావాలి. అదే మోక్ష స్థితి అంటే అన్నారు. శిష్యుడు వెంటనే ఆచార్యదేవుడిని ప్రశ్నిస్తూ బ్రతికి ఉండగానే చచ్చేది ఎలాగండీ? నాకు అంతా అయోమయంగా ఉంది అన్నాడు.

గురువుగారు మాట్లాడుతూ ఎప్పుడైతే నీకు లోకదృష్టి, దేహదృష్టి దారాపుత్రాదుల దృష్టి రహితం అవుతుందో అప్పుడు నీలో స్వార్థం, ఈర్ష్య, అసూయ, సోమరితనం పోతాయి, ఇవన్నీ నువ్వు ఎప్పుడు సాధించ గలుగుతావు? నీ మనస్సు లక్ష్యార్థం మీద నిలబడినప్పుడు మాత్రమే అన్నారు. శిష్యుడు మళ్ళీ ప్రశ్నిస్తూ 'గురువుగారూ! నాకు అంతా అయోమయంగా ఉంది. ప్రజ్ఞానం బ్రహ్మను నేను అని చెప్పారు కదా! అది తెలుసుకొన్నప్పుడు ఎలా ఉంటుంది?' అని అడిగాడు.

గురువుగారు మాట్లాడుతూ ప్రజ్ఞానం బ్రహ్మను నేనే అని తెలిసికొన్నప్పుడు నీ దారాపుత్రాదులలో అందరిలో పరమాత్ముడినే చూడ గలుగుతావు అప్పుడు అందరినీ ప్రేమించ గలుగుతావు. ఇంతవరకు మీ భార్యాభర్తలు ఇద్దరి మధ్య ఎప్పుడూ మనస్పర్థలే కదా! ఇద్దరూ ఎప్పుడూ ఉత్తర దక్షిణ ముఖాలే కదా! పెద్ద రాజకీయ నాయకుడిని అని చెప్పుకొనే వాడివి. నీ

భార్యని మొట్టికాయలు కొట్టేవాడివి. ఇంట్లో ఉన్న పాలన్నీ తాగేసే వాడివి. పాపం ఇంట్లో పిల్లలకి కనీసం మజ్జిగ కూడా ఉండేది కాదు. మళ్ళీ దేశాన్ని ఉద్ధరిస్తాను అని, సోషలిస్టునని ఉపన్యాసాలు కూడా దంచేవాడివి కదా! అటువంటి స్థితి పునరావృతం కాదు. నీ మనస్సులోని కలుషం హరించి పోతుంది అని చెప్పి లక్ష్యార్థం మీద నీ మనస్సు నిలిపి శాంతిని, ఆనందాన్ని పొందు అంటారు. ఆచార్యదేవుడు ఇంకొక శిష్యునికి కూడా లక్ష్యార్థాన్ని ప్రసాదించారు.

శ్రీబాబు మాట్లాడుతూ ఇద్దరు శిష్యులూ లక్ష్యార్థాన్ని స్వీకరించారు. కాని ఇరువురికి అనుభవాలలో తేడా ఉంది. లక్ష్యార్థాన్ని స్వీకరించన రెండవ శిష్యుడు దానిని స్వీకరించిన మరుక్షణం నుంచి మనస్సు దాని యందే లగ్నం చేశాడు. అతడు పరమానందంతో దానిని ధ్యానిస్తూ నా ప్రారబ్ధ కర్మ హరించి నాలోని గుణములన్నీ సుగుణాలుగా మారి నేను ధన్యత్వాన్ని పొందుతాను. నా జన్మ ధన్యమైనది. నాకు పునర్జన్మ లేదు. అని లక్ష్యార్థానికి ఎంతో విలువనిచ్చి దానిని మనస్సులో భద్రపరచుకున్నాడు.

ఇంక లక్ష్యార్థాన్ని స్వీకరించిన మొదటి శిష్యుడు ధ్యాన సమయంలో ఒక జపమాలని ధరించేవాడు. లక్ష్యార్థము నందు మనస్సు నుంచేవాడు. కాని మాలతో జపం చేస్తూ ఎప్పుడు కొలికిపూస వస్తుందా అని ఎదురు చూసేవాడు.

ధ్యానసమయంలో కాలదృష్టి ఉండకూడదు. మానసిక ధ్యానం చేయాలి. అప్పుడు మాల ధరించినా మనస్సు లక్ష్యార్థం మీద నిలచినప్పుడు జపమాల నిలచిపోతుంది. మనుస్సు ఎప్పుడైతే నిలిచిందో అప్పుడు జన్మ జన్మల నుంచి వచ్చిన ప్రారబ్ధ కర్మ హరించుకుపోతాయి. ధ్యానం కంటె త్యాగం గొప్పది. నీలోని గుణాలను త్యాగం చేయాలి అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ ఇక్కడ మీకు ఒక ఉపమానాన్ని చెబుతాను. నదిలో ఈదినప్పుడు నీటిని వెనక్కి తోస్తే ముందుకుపోతావు. విమానం ఎగిరేటప్పుడు గాలిని వెనక్కి తోస్తుంది. అలాగే మనస్సు లక్ష్యార్థం మీద నిలిపి ఆనంద సాగరంలో నీటిని తోసుకుంటూ ముందుకు వెళ్ళాలి. హనుమ ఆ విధంగా భవజలధిని ఈదుకుంటూ గుణాల్ని వెనక్కి తోసేశాడు. కాబట్టి శ్రీరామచంద్రుని దివ్యచరణారవిందాన్ని పట్టుకోగలిగాడు అన్నారు శ్రీబాబు.

-సశేషం

# శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**ఏప్రియల్ 2011**

**1 శుక్ర** మాసశివరాత్రి

**4 సోమ** శ్రీ ఖర నామ సంవత్సర ఉగాది. 11గంటలకు పంచాంగ శ్రవణం అనంతరం శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

**5 మంగళ - 11 సోమ** వరకు మౌనధ్యాన సప్తాహ శిబిరము. (ఆసక్తిగల భక్తులందరూ పాల్గొనవచ్చు)

**12 మంగళ** శ్రీరామనవమి. ఉ॥ 5.30ని॥ శ్రీసద్గురుపాదపూజ. 11గం.లకు శ్రీసీతారాముల సామూహిక కళ్యాణం, భక్తసమారాధన.

**18 సోమ** పౌర్ణమి. శ్రీసద్గురుపాదపూజ.

**27 బుధ** శ్రీ గురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ.

**30 శని** శనిత్రయోదశి.

**మే 2011**

**1 ఆది** మాసశివరాత్రి.

**8 ఆది** శంకర జయంతి, శ్రీ సద్గురు షోడశ వార్షిక ప్రతిష్టా మహోత్సవము,శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన

**17 మంగళ** వైశాఖ పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

**22 ఆది** శ్రీ మహాకాళికా పరమేశ్వరీ సహిత శ్రీరామలింగేశ్వర స్వామి త్రింశత్ వార్షిక ప్రతిష్టా మహోత్సవము, రాత్రి 7 గం.లకు శ్రీ మహాకాళికా పరమేశ్వరీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి వారి లీలా కళ్యాణ మహోత్సవము.

**27 శుక్ర** శ్రీగురుదశమి, హనుమజ్జయంతి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

**31 మంగళ** మాస శివరాత్రి.

# చండికేశ్వరుడు

ఆంగ్లమూలం- ఆర్. సంపత్,        తెలుగు అనువాదం - సుషుమ్నా ప్రసాద

ప్రగాఢమైన భక్తిసంపన్నులైన శివభక్తులు తమ ప్రభువుకు ద్రోహం తలపెట్టినవారి కెలాంటి శిక్ష వేయడానికి వెనుదీయరు. అలాంటి సందర్భములో ఎవరినీ కుడా వారు లక్ష్యపెట్టరు. పరమశివుని పట్ల తన తండ్రి చేసిన అపరాధమునకు తన తండ్రి అని కూడా తటపటాయించక ఆయన కాళ్ళను నరికివేసిన వీరశైవభక్తుడు చండికేశ్వరుడు. అతని పేరు విచారశర్మ. అతని అపారమైన భక్తికి మెచ్చి పరమేశ్వరుడు ఇచ్చిన బిరుదము చండికేశ్వరుడు.

విచారశర్మ తమిళనాడు, తంజావూరు జిల్లాలోని సందనూరు గ్రామవాసి. అతను యాచదత్తుడనే ఒక గొప్ప బ్రాహ్మణ పండితుని పుత్రుడు. తల్లి పవిత్ర. అతను పూర్వజన్మ సంస్కార ఫలితంగా ఐదేళ్ళ చిరుతప్రాయములోనే వేదవేదాంగములలో శివాగములలో కడునిష్ణాతుడైనాడు. అప్పటికే గొప్ప శివభక్తునిగా మారి, నిరంతరమూ పరమశివుని సంకీర్తన చేసేవాడు. స్వామి ఔన్నత్యమును గురించి చెబుతూ ఉండేవాడు. అతని చురుకైన మేధస్సును చూసి సంతసించిన తల్లిదండ్రులు ఏడవయేట. ఉపనయన సంస్కారము చేసి, వేదాధ్యయనము కొరకు గురుకులవాసమునకు పంపారు.

ఒకరోజు విచారశర్మ పాఠశాలకు వెళ్తుండగా ఒక పశువుల కాపరి, ఒక గోవును కర్రతో నిర్దాక్షిణ్యంగా బాదటం చూసి, అతనిని సమీపించి చేతిలోని కర్రను తీసుకుని, గోవును నిర్దాక్షిణ్యంగా బాదటాన్ని నిరసించాడు.

ఎందుకంటే దేవతలందరూ గోమాత శరీరంలో ఉంటారు. గోమాత పూజనీయమైన జీవి. గోమాతని ఆరాధించాలని చెప్పి, విచారశర్మ ఆవూరి పెద్దలకు ఈ విషయం ఫిర్యాదు చేసాడు. ఉదయం విద్యాభ్యాసానంతరం మధ్యాహ్నపు పూట గోవులను కాపాలా కాస్తానన్నాడు. నికి గోవుల మీద ఉన్న ప్రేమకు వారబ్బురపడి, పెద్దలతని విజ్ఞప్తికి ఒప్పుకొన్నారు.

ఆ మరునాటి నుండి శర్మ గోవులను, దూడలనుమేతమేయటానికి, మంచినీరు త్రాగటానికి స్వయంగా తోడ్పడేవాడు. శర్మ గోవులపట్ల చూపే వాత్సల్యానికి అవికూడా సంతసించాయి. గోవులు అతని పట్ల ఎంతో ప్రేమను పెంచుకొన్నాయి.

అతను కొంచెంసేపు కనబడకుండా పచ్చికబయళ్ళు వదిలిపోతే రోదించేవి. వాటికేకవిని, శర్మ తిరిగి రాగానే గోవులు ఆనందంతో తమ పొదుగుల నుండి క్షీరాన్ని వర్షించేవి.

శర్మ ఎంతో ఆదరంగా రక్షించటం వలన గోవులు, దూడలు ఇదివరకటికన్న బలిష్టంగా, సమృద్ధిగా పాలు ఇవ్వటం ప్రారంభించాయి. గోసంపద కలవారు గోవులధిక క్షీరాలు ఇచ్చి, తమ సంపదను ఇనుమడించటం వలన సమర్ధవంతమైన పోషణ చేస్తున్నందుకు, శర్మను ఎంతగానో అభినందించారు.

శర్మ గోవుల పొదుగుల నుండి అధిక క్షీరం రావటం చూసి, ఆ క్షీరం సద్వినియోగం చేసి, పరమ శివునకు అభిషేకం చేస్తే బాగుంటుందనుకున్నాడు. వెంటనే మట్టితో ఒక శివలింగం చేసి, అక్కడే ఒక ఆలయంగా ఏర్పరచి. మిగులు పాలు తాను కుండలతో నింపి, లింగమునకు వేదమంత్రాలు చదువుతూ అభిషేకం చేసాడు. ఇలా రోజూ అభిషేకం చేస్తూ కొంతకాలం గడిచిపోయింది.

ఒకరోజు తినుబండారాలు అమ్ముకొనే కుర్రవాడు శర్మ చేసే అభిషేకాన్ని చూసి, ఆ గోవుల యజమానులకు శర్మ గోక్షీరాలను వృథా చేస్తున్నాడని చెప్పాడు. వారు ఆగ్రహించి, ఈ విషయాన్ని శర్మ తండ్రి యాచదత్తునకు నివేదించి, దగిన చర్య తీసుకోమన్నారు. యాచదత్తుడు ఈ విషయాన్ని విచారించి, పాలు వృథా చేస్తున్నందుకు కొడుకును శిక్షిస్తానన్నాడు.

వెంటనే యాచదత్తుడు శర్మ పశువులు మేపు ప్రదేశానికి వెళ్ళాడు. అక్కడ తన పుత్రుడు గోక్షీరాలతో లింగమునకు అభిషేకం చేయుటం చూశాడు. అప్పుడు గోవుల యజమానులు చేసిన ఫిర్యాదు ఋజువైనందుకు యాచదత్తుడు కుమారుని గట్టిగా మందలించాడు.

లింగాభిషేకములో లీనమైన భక్తుడు శర్మకు తండ్రివేసిన పొలికేక వినబడలేదు. తన పనిలో తాను నిమగ్నమయ్యాడని గ్రహించలేక తనను నిరసిస్తున్నాడని ఆగ్రహంతో కర్ర తీసుకుని, విచారశర్మపై విసిరాడు. దెబ్బ తగిలినా చలించని పుత్రుని చూసి పట్టరాని ఆగ్రహంతో యాచదత్తుడు అక్కడ స్వామి అభిషేకమునకు పెట్టిఉన్న పాలకుండలన్నీ కాలితో తన్నివేశాడు. పాలన్నీ నేలపాలయ్యాయి.

ఈ దశలో కుర్రాడు కళ్ళు తెరచి. బాహ్యస్మృతికి వచ్చి ఒలికిపోయిన పాలను, పగిలిపోయిన కుండలను చూశాడు. స్వామి అభిషేకమునకు అంతరాయము కల్పించి, పాపాన్ని మూటగట్టుకున్న అపరాధి ఎవరాయని పరికించి చూసి, తన తండ్రియే అందులకు బాధ్యుడని గ్రహించాడు. స్వామికి అంతటి అపరాధము చేస్తాడాయని ఆగ్రహించి, తండ్రియని కూడా లెక్కచేయక, అక్కడ చెట్టు మొదలు ఉన్న గొడ్డలి తీసుకుని ఒక తృటికాలంలో తండ్రి కాళ్ళను నరికివేస్తాడు.

యాచదత్తుడు బాధతో మెలితిరుగుతూ భూమిపై కూలిపోయాడు. వెంటనే నందివాహనుడై పరమేశ్వరుడు పార్వతీ సమేతుడై, గగనమందు ప్రత్యక్షమై శర్మకు దర్శనభాగ్యం ప్రసాదించి ఇలా ఆశీర్వదించాడు "ఓ నా ప్రియపుత్రా! నీప్రగాఢ భక్తికి మెచ్చాను. నీ ఆరాధనకంతరాయము కలిగించినందుకు తండ్రియని కూడా లెక్కచేయకుండా శిక్షించావు.

ఇప్పుడు మేము (పార్వతీపరమేశ్వరులు) నీ జననీ జనకులము. (శర్మను ప్రేమతో ఆలింగనం చేసుకుని) నీకు చండీశ్వర స్థితిని ప్రసాదిస్తున్నాము. చండీశ్వరుడిగా ప్రసిద్ధి చెంది, ఇకమీదట ఆలయంలో నాకు జరిగే ఆరాధనంతా నీకు కూడా చెందుతుంది. నీకొక వరాన్ని ప్రసాదిస్తాను. ఏంకావాలో కోరుకో" అన్నారు.

వెంటనే శర్మ స్వామిని ప్రార్థించి తన తండ్రికి కాళ్ళను ప్రసాదించమని కోరుకున్నాడు. స్వామి వెంటనే 'తథాస్తు' అన్నాడు. వెంటనే యాచదత్తుని కాళ్ళు మామూలుగా వచ్చాయి. ఆయన కొడుకుని క్షమించమని పశ్చాత్తాప హృదయంతో స్వామి చరణములపై మోకరిల్లాడు.

అప్పటి నుండి విచారశర్మ చండికేశ్వరుని గోనాయనార్లుగా ప్రసిద్ధి చెందిన 63భక్తులలో ఒకరిగా వినుతికెక్కాడు. నాటి నుండి తమిళనాడు శివాలయంలో స్వామి కుడివైపున చండికేశ్వరుని విగ్రహం ఉంటుంది.

నాటి నుండి భక్తులు శివాలయములు సందర్శించినప్పుడు, పంచమమూర్తియైన చండికేశ్వరుని దర్శించకపోతే వారి యాత్ర పరిరపూర్ణం కాదు. పరమేశ్వరుడు, పార్వతీదేవి, గణపతి స్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, చండికేశ్వరుడు పంచమూర్తులుగ ప్రసిద్ధి చెందారు. ఆలా చిరుత్వమును సాధించిన మహనీయుడు చండికేశ్వరుడు. *

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

**16వ శ్లో॥ మణినూపుర వాచాలం వన్దే తచ్చరణం విభోః ।
లలితాని యదీయాని లక్ష్మాణి వ్రజ వీధిషు ॥**

తలుపునానుకుని నిలబడే ఉంది అలివేణి, ఒకడుగు లోపలికివేసి తీసేలోగా ఎక్కడ కనబడకుండా వెళ్ళిపోతాడోనని వీధుల్లో కాలి గజ్జలమోత వినబడుతూనే ఉంది. అది ఎటునుంచి వస్తున్నదో అర్థం కావటం లేదు. పిల్లడు కనబడడు, మువ్వల సవ్వడి మాత్రం చెవులబడుతూనే ఉంటుంది. ఎంత ఎదురు చూస్తున్నా లాభం లేకుండా ఉంది. అలివేణికి కోపం వచ్చేస్తోంది. నిన్నటికి నిన్న పక్కింట్లో, మొన్న ఎదురింట్లో, అటుమొన్న వెనకింట్లో..........మరి తనింట్లోకి ఎందుకు రానట్టు? ఏం తీసిపోయింది తన యిల్లు?

ఉట్టి మీద వెన్న పిడత, పొయ్యిమీద పాల కడవ, కవ్వం కింద పెరుగుబాన అన్నీ నిండుగానే ఉన్నాయి. దొడ్లో జామ చెట్టుమీద దోరగా ఉన్న కాయలు, ముగ్గిన పళ్ళు అన్నీ ఉన్నాయి. మరి ఏం లోటుందని? అలివేణి రాత్రీ పగలూ ఉలిక్కిపడి చూస్తూనే ఉంది. ఏ పిల్లో పారిపోతూ, కాకైతే ఎగిరిపోతూ కనిపిస్తున్నాయి తప్ప, తన ఆశ తీరటం లేదు. పోనీ, కనబడినప్పుడు రమ్మని పిల్చుకుని వస్తే! అందరిళ్ళకీ పిలుస్తేనే వస్తున్నాడా? అలా చేస్తే అందులో ఆనందం ఏముందనీ? దొంగలాగ లోపలికి దూరాలి, పాలు పెరుగులు చిందర వందర చెయ్యాలి, పట్టుకోబోతే దొరక్కుండా పారిపోవాలి అదీ అలివేణి కోరిక.

చీకటి పడింది. తన యింటికి దగ్గర్లోనే ఎవరివో గుసగుసలు వినిపిస్తుంటే ముందుకి చూసింది. అక్కడ పారిజాతం చెట్టు నీడలో నిలబడి ఉన్నారు. ఇద్దరు గోపెమ్మలు. నాలుగడుగులు నడిచి వాళ్ళ దగ్గరకెళ్ళింది. తమ జాతిదే గదాయని వాళ్ళు అలివేణిని చూసికూడా వాళ్ళు మాటలు ఆపకుండా చెప్పుకుంటున్నారు.

పైన పున్నమి వెన్నెలలు పారిజాతం పూలమీద పడి చెదిరి చిన్న చిన్న వెండి ముక్కల్లాగ మెరుస్తున్నాయి. ఒకామె చెప్తున్నది "నిన్న సాయంత్రం

నేను పందిరి మీద జాజి మొగ్గలు కోస్తుంటే, ఎప్పుడు వచ్చాడో, లోపలి నుంచి ముక్కాలిపీట తెచ్చుకుని, నా పక్కనే వేసుకుని ఎక్కి తను కూడా పూవులు కోయటం మొదలు పెట్టాడు.

కన్నయ్య వంటి మీద నుంచి వస్తున్న గంధం, కస్తూరి వాసనలు, అప్పుడే విరుస్తున్న జాజి పూల పరిమళాలను అణిచి వేస్తున్నాయి. కోసిన పూలను వెదురు బుట్టలో వేస్తూ "ఒక్క పువ్వు కోయకుండా వదిలివేసినా అది ఏడుస్తుంది సుమా!" అంటూ , "ఏం చేస్తావు వీటిని?" అని అడిగాడు. నేను సంబరంగా "ఇప్పుడు నువ్వు వచ్చావు కదా! మాల కట్టి నీ మెళ్ళో వేస్తాను" అన్నాను.

"ఊహూఁ అలా కాదు. నాకూ మాల కట్టడం వచ్చును. ఇది ఒక్కటే ఏమిటి, అన్ని పనులూ వచ్చును. ఎవరూ నేర్పలేదు. వాటంతట అవే వస్తాయి నాకు. నేనన్నీ దండకట్టి తీసికెళ్ళి మా అమ్మకిస్తాను.

బారెడు జుట్టు, చెవి ప్రక్కగా కొప్పు పెట్టుకుని, ఆ కొప్పుమీద ఈ మాల పెట్టుకుంటే, మా అమ్మ ఎంత అందంగా ఉంటుందనీ! పచ్చని ముఖంలో చారడేసి కళ్ళు, ఆ కళ్ళ నిండా కాటుక పెట్టుకుని, నుదుట కాసంత బొట్టు ఎర్రగా మెరుస్తుంటే, నా వంక ఎంత ప్రేమగా చూస్తుందో మా అమ్మ!

అన్నట్లు ఇటు చూడు! ఈ పక్కన ఉన్న చెట్ల నిండా విచ్చిన చంద్రకాంతం పూల రంగులో ఉన్న సరిగంచు చీరె కట్టుకుని దేవతలా ఉండే మా అమ్మ నన్నెత్తుకుని ముద్దు పెట్టుకుంటుంటే ముక్కుకున్న పగడపు ముక్కెర, కిందకి వేలాడే ముత్యపు నత్తు వత్తుకుని, బుగ్గలకి కితకితలు పెట్టినట్లు చేస్తూ, నా మీద తనకున్న ప్రేమంతా మూటగట్టి ఇస్తున్నట్లు ఉంటుంది."

ఇలాగ వాళ్ళ అమ్మని, ఆమె ప్రేమని వర్ణించి, వర్ణించి చెప్పి మురిసిపోతూ "ఇప్పుడు నా కోసం పాలబువ్వ పెట్టాలని ఎదురు చూస్తూ ఉంటుంది. మరి వస్తా" అంటూ అంతవరకూ కట్టిన పూలదండ పట్టుకుని పారిపోయాడు.

ఇంత మధురమైన అనుభవాన్ని చెప్తుంటే తన్మయమై వింటున్న రెండో గోపిక "ఇది వినవే......" అంటూ మొదలు పెట్టింది. అలివేణి నిశ్శబ్దంగా వింటున్నది.

- సశేషం.

# బెంగుళూరులో శ్రీ మాతాజీ

-పరాశర ప్రసాద్

శ్రీయోగిని చంద్రకాళీప్రసాద మాతాజీ భక్తులకు బోధ చేస్తూ, సద్గురుమూర్తిని ఆశ్రయించనిదే భక్తి సిద్ధిస్తుందా? తాను ఆశ్రయించిన సద్గురు మూర్తిని సందర్శించినప్పుడు నిజమైన గురుభక్తుడు తనను తాను మరచిపోతాడు. నేను పూలు సమర్పిస్తున్నానా? ఆపిల్స్ తెచ్చానా? అనే ఆలోచన కల్గదే? సద్గురుమూర్తిలోని దివ్యత్వాన్ని మాత్రమే గుర్తించగలుగుతాడు. ఆ స్థితిని పొందింప జేసేది గురుమూర్తి మాత్రమే. నీ నిజ జీవితంలో కూడా నీ తల్లిని, తండ్రిని, ఆచార్యుని, దేవతల్ని, భగవంతుడిని ఎలా పూజించాలి, ఎలా గౌరవించాలి అని తెలియజేసేది గురుమూర్తియే. 'నగురో రధికం, నగురో రధికం, నగురో రధికం' అని తెలియజేసింది ఎవరు? పరమేశ్వరుడే కదా! చెప్పి ఊరుకున్నాడా ఆయన శాసించాడు. 'నా గురువే సర్వరక్షకుడు' అని పరిపూర్ణ విశ్వాసంతో సద్గురుమూర్తిని ఆశ్రయించిన వాడు జనన మరణ విషవలయం నుండి బయటపడటానికి అగ్నిలో చిక్కుకున్న పిల్లిలాగా ఆవేదన చెందాలి కదా!

సాధకుడు బంధువులు, స్నేహితులు, విషయాదులనే ప్రాపంచిక గ్రహాల మధ్య సంచరిస్తూ నిగ్రహము కలిగియుంటేనే సాధన ఫలిస్తుంది. పూజ చేసినా, చెయ్యకపోయినా ఫర్వాలేదు కాని సజ్జన సాంగత్యానికి సుముఖత చూపినవాడు జననమరణ సాగరము నుండి బయట పడటానికి అవకాశం ఉంటుంది. ప్రతి సాధకుడు తన నిత్యజీవితంలో నడుచుకునే విధానాన్ని గురించి విచారణ చేస్తే తన సంగతి తనకి తప్పక అవగతం అవుతుంది. భగవంతుని సన్నిధికి వచ్చినవారు తమ వ్యక్తిగత వ్యవహారాలని మరచిపోవాలి. సత్సంగంలో శ్రవణం ద్వారా పరస్పర భావాలను అర్థం చేసుకుని, మనస్సుని పీడించే కామక్రోధాది గుణాలను తొలగించుకోవాలి. మనస్సులో నిలుపుకున్న మాధవుని పదమును మరచి, ద్వైతంలో ఉన్నవారికి, అద్వైతానందం ఎలా అందుతుంది? మనస్సుని ప్రశాంతంగా ఉంచుకోవాలి. ప్రశాంతత బయట నుంచి వచ్చిందా? లోపలి నుంచి వచ్చిందా? భగవంతుని ధ్యానానికి ఏ ఆసనంలో కూర్చున్నా ఫరవాలేదు. మనస్సు కదలికలు లేకుండా ఉండాలి.

మనస్సు ఉన్నవాడు మానవుడు. శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలో మనస్సే ఇంద్రియాలలో ప్రధానమైనది అన్నది యదార్థమే కదా! మనస్సు ద్వారానే తృప్తిని పొందుతున్నారు ఎవరైనా. మనస్సే లేకపోతే అపస్మారక స్థితే కదా. ప్రపంచంలో మనం చేసే పనులలో కూడా మనస్సు అడ్డుపడుతుంది. మనస్సు అనుమతించినంత వరకే మనము చేస్తాము. నేను, నాది, నావారు అనే మమకారాన్ని వదిలిపెట్టి ధర్మమైన ప్రేమని అందజేయ గల్గాలి. అన్నింటికంటె ఆశ్చర్యకరమైన విషయము చనిపోయిన వాడిని గురించి ప్రతివారు దుఃఖిస్తారు. కాని ఆ స్థితి ప్రతివారికి ఈ రోజు కాకపోయినా మరొక రోజైనా తప్పనిసరి అని ఆక్షణంలో మాత్రం గుర్తించరు అన్నారు శ్రీమాతాజీ. సాక్షిగా ఉండి సర్వజగత్తును ప్రకాశింపజేసేది నీవే అని నిజమైన జ్ఞానాన్ని అందించేది గురుమూర్తి. దానిని గుర్తించ గల్గినవాడు ధన్యుడు. *

అఖండానంద సరస్వతీ స్వామి దగ్గరకు ఒక క్షుద్ర సిద్ధుడు వచ్చి, తొడ క్రింద నుంచి కరెన్సీ నోట్లు సృష్టించి చూపించాడు. అప్పుడు స్వామివారు ఇలా అన్నారు..........

"ఈ నోట్లు క్రొత్తగా సృష్టించి యిస్తున్నారా? లేక ఎక్కడో, ఎవరి దగ్గరనుంచో ఆకర్షించి యిస్తున్నారా?

క్రొత్తగా సృష్టించటం గవర్నమెంటును మోసగించటం. నెంబర్లు రెండు అవుతాయి గదా! లేదా ఒక వ్యక్తి దగ్గర ఉన్న వాటిని తాకి, వాటిని ఆకర్షించి యిస్తే, ఆ వ్యక్తిని మోసగించి నట్లు. రెండూ సాధకులకు తగని పనికదా?

# శ్రీ బాబూజీ దివ్యవాణి

ప్రతి శరీరానికీ ఒక పేరు, రూపము, జాతి, కులము, గోత్రమూ గుణదోషాలూ ఉంటాయి. అది ఏదో ఒక ప్రదేశానికి చెందినది; ఒకానొక కాలంలో ఉన్నది; అంతకు ముందుకానీ, వెనుక కానీ లేనిది. ఆ ఉన్న కాలంలో కూడా అనుక్షణమూ మారుతూ ఉండేది. కాని, యిలా జాతి, నీతి, కుల, గోత్ర, నామ, రూప, గుణ, దోష, కాల భేదాలు గల ఇన్ని ఉపాధులలోనూ సర్వత్రా వ్యాపించి ఉండి, వాటన్నింటినీ ప్రకాశింపచేస్తూ తాను స్వయంగా ప్రకాశించే వస్తువు ఒక్కటే; అదే చైతన్యం లేక ప్రజ్ఞాన పరబ్రహ్మం. దానికి ఈ భేదాలేమీ లేవు. పరిణామాలు లేవు. అంటే చావు పుట్టుకలు లేని శాశ్వతమైన ఆత్మ వస్తువు.

మానవుడు ప్రేమించ వలసినది ఈ ప్రజ్ఞాన పరబ్రహ్మమునే గాని, పరిణామ శీలమై, జాతి, కుల, నామ రూప, భేదాలతో ఉన్న శరీరాన్ని కాదు. ఈ శరీరం తనది గాని, తాను కాదు. తాను కేవల ప్రజ్ఞాన పరబ్రహ్మము. ఇదే విషయాన్ని శ్రీ శంకర భగవత్పాదులవారు గుర్తు చేస్తూ, నిరంతరం "ఆ ప్రజ్ఞాన బ్రహ్మమునే నేను" అని ధారణ చేయమని ఉద్బోధించారు.

కాని, మానవుడు అజ్ఞానం చేత ఈ శరీరమే తాననే భ్రాంతిపడి దాన్నే ప్రేమిస్తున్నాడు. దానికి కలిగే పరిణామాలన్నీ, అంటే పుట్టటం, పెరగటం, చావడం మొదలైన షడూర్మ్ములు, బాల్య, కౌమారాది అవస్థలూ అన్నీ తానే పొందుతున్నాననుకుని దుఃఖాన్ని, అశాంతిని అనుభవిస్తున్నాడు. చావంటే భయపడుతున్నాడు. దారాపుత్రాదులు మరణిస్తే ఏడుస్తున్నాడు.

ఇక్కడ ఒక గొప్ప రహస్యం ఉంది. నిజానికి మానవుడు ప్రేమిస్తున్నది లోపలి చైతన్యాన్నే. కాని అది కనిపించదు. కనిపించే జడమైన శరీరం చైతన్య సహితమై అది ప్రకాశిస్తుంది. కనిపించేది శరీరమే కనుక ఆ శరీరం మీద మమకారం పెంచుకుంటాడు. కాని చైతన్యాన్నే ప్రేమించమనీ, అదే తానని తెలుసుకోమనీ, సర్వత్రా దానినే దర్శించమని అంటున్నారు భగవత్పాదులవారు. మహాత్ములు, పండితులు అలా తెలుసుకున్నవారు గనుకనే అందరిలోనూ పరమాత్మ వస్తువును దర్శించి, అందరినీ ప్రేమించ గలుగుతున్నారు. **"విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని, శునిచైవ శ్వపాకేచ, పండితా స్సమదర్శినః"** అని గీతాచార్యుడన్న వాక్యానికి అర్థమిదే. విద్యా వినయ

సంపదతో కూడిన బ్రాహ్మణునిలోను, గోవులోను, కుక్కలోను, కుక్కమాంసం వండుకుని తినే చండాలునిలోనూ కూడా ఆత్మవస్తువును దర్శించగలవారే పండితులు. అనుభవజ్ఞులైన అట్టి మహాత్ములను గురుదేవులుగా ఆశ్రయించి, వారి అడుగు జాడలలో నడుచుకుంటూ, వారి ఆదేశాలను పాటించడమే మానవాళికి తరణోపాయం.

**సదాశివ సమారంభాం,**
**వ్యాస శంకర మధ్యమాం,**
**అస్మదాచార్య పర్యంతాం**
**వందే గురు పరంపరాం ॥**

'సదాశివునితో ప్రారంభమై శ్రీ శంకర భగవత్పాదుల ద్వారా మన గురుదేవుల వరకు వస్తున్న గురు పరంపరకు నా నమస్కారములు' అని మనము స్మరించుకుంటున్నాము. ఈ పరంపరలో అందరూ పరమహంస స్వరూపులే. అందరిది ఒక్కటైన పరబ్రహ్మ స్వరూపమే. మన గురుదేవుడే సదాశివుడు, ఆయన శ్రీ శంకర భగవత్పాదాచార్య స్వరూపుడు. గురువుకు, పరమాత్మకు భేదం లేదు. భవసాగరం నుండి తరింపచేసే గురుదేవుని పాదపద్మములయందు మనస్సును భక్తి ప్రపత్తులతో నిలపాలి. అలా నిలపలేని వాడు ఎన్ని సంపదలున్నా, ఎంత పదవి ఉన్నా, ఎన్ని విద్యలున్నా, నిరర్థకమే అని తెలుపుతూ **'గురోరంఘ్రి పద్మే మనశ్చేన్న లగ్నం తతః కిం, తతః కిం, తతఃకిం తతఃకిం''** అనే మకుటంతో గుర్వష్టకాన్ని అందించారు శ్రీ భగవత్పాదులవారు.

కుక్కగొడుగుల వలె బయల్దేరిన కుమతాలన్నింటినీ ఖండించి, షణ్మతస్థాపనాచారులై అన్ని సిద్ధాంతాలకూ మకుటాయమానమైన అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, సుప్రతిష్ఠితం చేసిన మహా ప్రవక్త శ్రీ శంకర భగవత్పాదులవారు.

'ఆశలూ, ఆడంబరాలూ లేనివాడు, తృప్తి గలవాడు, వైరాగ్యశీలి అయిన కౌపీనధారి అష్టైశ్వర్యాలు కలవానికంటే అదిక భాగ్యవంతుడు' అని తెలుపుతూ **"కౌపీనవంతః ఖలు భాగ్యవంతః"** అనే మకుటంతో కౌపీన పంచకాన్ని రచించారు. ఒకటేమిటి, అమేయ ప్రతిభా సంపన్నులు అందించిన సందేశాలు అసంఖ్యాకములు, అమూల్యములు. అవి అన్ని కాలాల వారికీ, అన్ని దేశాలవారికీ మార్గదర్శములుగా ఉండగలవు.

కనుకనే శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారి వంటి మహాత్ముడు. శేముషీ సంపన్నుడు, తత్త్వవేత్త, సర్వజ్ఞుడు, ప్రవక్త నభూతో న భవిష్యతి అని ప్రపంచంలో అన్ని దేశాలవారూ ఆనాటినుండీ ఈనాటివరకూ నివాళులు అర్పిస్తున్నారు. భారతదేశం ప్రపంచానికే ఆధ్యాత్మిక గురుపీఠంగా పరిగణించ బడడానికి శ్రీ శంకర భగవత్పాదులు, శ్రీ బుద్ధ భగవానుల వంటి అవతార పురుషులే కారణమనటం నిర్వివాదమైన అంశం.

ఆనాడు అంతటి భగవత్పాదులూ జాతి, కుల అభిమానాన్ని వదులుకుంటే వదులుకున్నారు గాని, మేము వదులుకుంటామా, అని దురభిమానాలతో సతమతమవుతున్నారు నేటి మానవులు. తత్ఫలితాలన్నీ అనుభవిస్తూనే ఉన్నారు. పరస్పర ద్వేషం, అసహనం, క్రోధం, పెంచుకుని విషపూరిత భావాలతో పరస్పర వినాశనాన్ని ఆకాంక్షిస్తూ అశాంతికీ, దుఃఖానికీ, గురి అవుతున్నారు. సుఖ శాంతులను పొందాలంటే, శ్రీ శంకరభగవత్పాదా చార్యులవారి అమూల్య సందేశాలను మళ్ళీ ఒకసారి పునశ్చరణ చేసుకుని వాటిని చిత్తశుద్ధితో ఆచరించే ప్రయత్నం చేయాలి.

శ్రీ శంకర జయంతి సందర్భంగా శ్రీ కాళీ గార్డెన్సులో సమావేశమైన భక్తుల నుద్దేశించి ప్రసంగిస్తూ, శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారు పై సందేశాన్ని అందజేశారు.*

## చందాదారులకు మనవి

మీకు సమర్థసద్గురు మాసపత్రిక ప్రతినెల పంపుతున్నాము. మీ అడ్రస్సు ప్రక్కన మీ సభ్యత్వం నెంబరు, మరియు ఎప్పటితో ముగిసేది తెలియజేస్తున్నాము. దానిని గమనించి మీరు చందా ముందుగానే చెల్లించి కంటిన్యూ చేసుకోగలరు.

- మేనేజర్

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీబాబు తమ దేవతార్చన పున్నయ్య గారి యింట్లోనే ఉంచారు. పూజ చేసి ప్రతిరోజూ తీర్థ ప్రసాదాలిచ్చారు. గోపాల్‌కు త్వరలోనే స్వస్థత కలిగింది. కాళ్ళు చేతులలో కదలికలు వచ్చాయి. తల కూడా మామూలుగా ఎదిగింది. పున్నయ్యగారికీ, వీరరాఘవయ్య గారికీ శ్రీబాబు యెడల అనన్య విశ్వాసం ఏర్పడింది. తమ పేరు 'వెంకట స్వామి' అని శ్రీబాబు పున్నయ్యగారితో చెప్పారు. (తమకు ఆపేరు ఉండేదని శ్రీబాబు, ఆ తరువాత కూడా భక్తులతో చెప్పారు.)



శ్రీబాబు పున్నయ్యగారింటికి వచ్చేసరికి, వీరరాఘవయ్యగారి మొదటి కుమారుడు పాండురంగ శ్రీశైలరావుకు (పాండు) 4 లేదా 5 సంవత్సరముల వయస్సు. పాండు పుట్టిన తేదీ 1933.శ్రీ బాబు గుంటూరుకు రాక ముందే, మంగళగిరిలో శ్రీ కోటిలింగంగారు వారిని దర్శించారు. దీనిని బట్టి శ్రీ బాబు గుంటూరుకు 1937 ప్రాంతంలో వచ్చి ఉండవచ్చును. అంతకు ముందే (సుమారు 1936లో) మంగళగిరి వచ్చి ఉండవచ్చును.

పాండు కన్నతల్లి పాపాయమ్మగారు, పెంపుడు తల్లి బచ్చు కాంతమ్మ గారు, శ్రీబాబు వంగపండు రంగు బట్టలు కట్టేవారని, ముక్కుకు కాడ, చెవికి పోగు, కాళ్ళకు గండ పెండేరం (కడియం), చేతి దండకు ఆంజనేయస్వామి గంట ఉండేవని చెప్పారు. ఉదయమూ సాయంత్రమూ పూజ చేసుకొనేవారనీ, పూజ సమయంలో ఎవరినీ దగ్గరకు రానిచ్చేవారు కాదనీ, పూజ గదిలోనే వారి నివేదన పదార్థాలను ఉంచితే, వారే వడ్డించుకొని భోజనం చేసేవారనీ, అయిదు ముద్దలే తినేవారనీ, భోజన సమయంలో కూడా ఎవరినీ దగ్గర ఉండనిచ్చేవారు కాదనీ, భోజనానంతరం ఆ పాత్రలన్నీ వారే కడిగి పెట్టేవారనీ చెప్పారు. వారి సామాన్లు మూడే అనీ, ఒకటి వారి దేవతార్చన పెట్టెను ఉంచిన సంచి,

రెండవది వారి బట్టల సంచి, మూడవది గొడుగు అనీ, ఒక కమండలం కూడా ఉండేదని చెప్పారు. ఎప్పుడూ పట్టు బట్టలో, కొత్త బట్టలో కట్టుకునే వారనీ, వారితో ఎక్కువగా మాట్లాడటానికి జంకేవారమనీ, వారు మాత్రం అందరితో బాగానే మాట్లాడేవారనీ, వచ్చేటప్పుడూ, వెళ్ళేటప్పుడూ రిక్షాలోగాని, నడిచిగాని, వచ్చి వెళ్ళేవారని చెప్పారు.

గుంటూరులో నూనె శివయ్యగారు, ఆకుల రత్తయ్యగారు మొదలైన వారి యిళ్ళకు కూడా శ్రీబాబు వెడుతూ ఉండేవారు. శివయ్యగారి కుమారుడు మహాబలేశ్వరరావుగారు శ్రీబాబుకు బాల్య మిత్రుడు. వాళ్ళిద్దరూ కలిసి గోడు బిళ్ళ, దాగుడు మూతలు మొదలైన ఆటలు ఆడుకునేవారు.

మంగళగిరిలోను, గుంటూరులోను, శ్రీ బాబు ప్రధమంగా వెల్లడై సంచరించిన వివరాలను మాత్రమే యిక్కడ పేర్కొనటం జరిగింది. గుంటూరు భక్తులతో శ్రీబాబు సాన్నిహిత్యాన్ని గురించి మరొకఅధ్యాయంలో వివరించబడింది. *

## సమదృష్టి

ఒకరోజు కబీర్‌దాసు, అతని కుమారుడు కమాల్‌దాసు ప్రయాణం చేస్తున్నారు. ముందు నడుస్తున్న కబీర్‌కు దారిలో ఒక బంగారు కడియం కనిపించింది. కొడుకు దాని ఆకర్షణకు లోబడతాడేమో అని దాని మీద వెంటనే ఇసుక కప్పాడు కబీరు.

ఇది చూసిన కమాల్‌దాసు "నాన్నా! ఏం చేస్తున్నావు?" అని అడిగాడు. కబీర్ కడియం దొరికిన సంగతి చెప్పి, "దీన్ని చూస్తే నీకు లోభం కలుగుతుందేమోనని ఇసుకలో కప్పెట్టాను" అన్నాడు.

"నీ దృష్టిలో బంగారమనీ, ఇసుకనీ ఉందేమోగానీ, నా దృష్టిలో రెండూ ఒక్కటే నాన్నా!" అన్నాడు కమాల్‌దాసు.

అది విన్న కబీర్‌దాసు బ్రహ్మానందాన్ని పొందాడు.

# గిరిజా విజయం

-సుశీలా ప్రసాద

సత్యలోకంలో చతుర్ముఖుని సన్నిధిలో దేవతలంతా వాడిన మొహాలతో నిలిచి ఉన్నారు. పరమేష్ఠిని తమ దివ్య స్తోత్రాలతో ఆలరించగా వారి యందు బ్రహ్మ ప్రసన్నుడైనాడు. దీనులై ఉన్న వారందరినీ అనునయ వాక్యాలతో పలకరించి, తన వలన ఏమి సాయం కోరివచ్చారో చెప్పమన్నాడు. ఆ మాటలతో మనస్సులు కలతేరగా ఇంద్రుడు తమ గురువైన బృహస్పతిని చెప్పమని కనుసైగ చేశాడు.

"భగవాన్! సర్వాంతర్యామివైన నీకు తెలియనది ఏమున్నది? నీ చేత వరాలు పొందిన తారకాసురుడు గర్వంతో లోకాలన్నిటినీ బాధ పెడుతున్నాడు. దేవతల సంపదలన్నీ వాని హస్తగతమైనాయి. వారి అధికారాలన్నీ శత్రువుల పరమైనాయి. కనుక ఆ దుష్టుని వధించగల సేనా నాయకుని సృష్టించమని వేడుకుంటున్నాము ప్రభూ!" అన్నాడు దేవగురువు.

"మీ కోరిక తప్పక నెరవేరుతుంది. అయినా కొంతకాలం మీరు నిరీక్షించ వలసి ఉన్నది. ఆ సృష్టి నా వలన జరగదు. ఎందుకంటారా, నా వల్లనే వరాలు పొంది వృద్ధి పొందినవాడు వాడు విషవృక్షమైనా తానే పెంచి, తానే నరకటం యుక్తం కాదు కదా! మునుపే వాడు దేవతల వల్ల చావు లేకుండా వరం పొందాడు. కనుక మార్గమేమిటంటే రణకుశలుడైన ఆ రాక్షసుణ్ణి శివతేజోంశ సంభవుడైనవాడే వధించగలడు. తమోగుణ రహితుడైన పరమాత్మ అయిన పరమేశ్వరుడు ఇప్పుడేమో తపో వృత్తిలో ఉన్నాడు. ఆయన మనస్సుని హిమగిరి తనయ అయిన పార్వతీదేవి అందంతో ఆకర్షింపబడేటట్లుగా చూడవలసి ఉన్నది. కారణం ఏమిటంటే బ్రహ్మరుద్రులమైన మా ఇద్దరి వీర్యం ధరించటానికి ఇద్దరే సమర్థులు. హరవీర్యాన్ని పార్వతి, నా వీర్యం ధరించడానికి ఈశ్వరుని అష్టమూర్తులలో ఒకరైన జలం సమర్థాలైనవి. అలాగ సంభవించే ఈశ్వర కుమారుడు మీకు సేనాధిపత్యం వహించి తారకాసురుని సంహరించ గలడు" అని చెప్పి అంతర్ధానమయ్యాడు పద్మసంభవుడు. విధాత మాటలు వారికి మార్గం చూపగా దేవతలంతా కార్యాచరణ నిమగ్నులైనారు. ఇంద్రుడు తలచిన మరుక్షణం మదనుడు వాని ముందున్నాడు.

"మిత్రమా! నాకున్నవి రెండు అస్త్రాలు. ఒకటి వజ్రాయుధం, రెండు నువ్వు. వజ్రాయుధం తపశ్శాలుల విషయంలో పనికిరాదు. ఇక నువ్వో! సర్వ ప్రదేశాలలో నిరాటంకంగా సంచరించగలవు. దేవతలంతా శివుని తేజస్సు

వలన జనించే సేనా నాయకుని కోరుతున్నారు. ఆ పరమేశ్వరుడేమో బ్రహ్మ తత్త్వము నందే చిత్తం నియమించి, తపోనిష్ఠుడై ఉన్నాడు. అతడు నీ బాణానికే సాధ్యుడౌతాడుగాని, వాని యందు ఇతర సాధనాలేవీ పని చేయవు. మహాదేవుని తేజస్సు ధరించటానికి హిమవంతుని పుత్రిక అయిన పార్వతీదేవి మాత్రమే సమర్థురాలని బ్రహ్మదేవుడు చెప్పాడు. కనుక ఆమెను శివుడు వరించే ప్రయత్నం చెయ్యి. ఇప్పుడామే తండ్రి ఆజ్ఞపైన కొండ మీద తపోనిష్ఠలో ఉన్న శివునికి సేవలు చేస్తున్నది. ఆమె వలన కావలసిన ఈ కార్యానికి నువ్వు బీజం మొలకెత్తేందుకు ప్రధానమైన నీటి వంటి వాడవు. అందుచేత దేవతల కార్యసిద్ధికై నువ్వు యత్నించు. వెన్నుతట్టి తనెంతో ఉత్సాహపరుస్తున్న ఇంద్రుని వాక్యాలు మదనుని కార్యోన్ముఖుని చేశాయి. వెంటనే తన సఖుడైన వసంతునితో కలసి శివుని ఆశ్రమ ప్రాంతానికి తరలిపోయాడు.

వసంతాగమనంతో వనమంతా కలకలాడిపోయింది. తొలి అడుగులోనే లతాగృహద్వారం దగ్గిర ఎడమ చేతిలో బంగారు బెత్తం పట్టుకుని, నోటిమీద కుడిచేతి చూపుడు వ్రేలు ఉంచి ప్రమథగణాలను అల్లరి చేయకండని ఆజ్ఞాపిస్తున్న నందీశ్వరుడు కనిపించాడు మన్మధునికి. వాని ఆజ్ఞ చేత పశుపక్షిచరాచరాలన్నీ కదలక ఎక్కడివక్కడే పటంలో గీసిన బొమ్మలాగ నిశ్చలంగా ఉండిపోయాయి. అతని దృష్టిలో పడకుండా సురపొన్నలు అల్లుకున్న శివుని ధ్యాన సమాధి స్థానానికి వెళ్ళాడు మన్మధుడు.

దేవదారు చెట్టు అరుగుమీద పులితోలు పరచుకుని, పద్మాలవంటి రెండు అరచేతులు వెల్లకిలా తొడలమీద ఉంచుకుని వీరాసనం వేసుకుని కూర్చుని ఉన్న హరుని చూశాడు మదనుడు. పాముతో జటల నెత్తి ముడివేసుకున్నాడు. చెవులు రెండు కొసలకి జపమాల తగిలించుకున్నాడు. నల్లని చారల లేడి చర్మాన్ని ధరించాడు. నిశ్చలమైన, కాంతివంతమైన కనుగుడ్లను నాసికపై నిలిపి, కురవని మేఘంలాగ, గాలిలేనిచోట దీపంలాగ, అలలు లేని మడుగులాగ ఉన్నాడు నీలకంఠుడు. ప్రాణవాయు నిరోధం చేసిన శంకరుని గొప్ప తపోగ్ని జ్వాలలు బ్రహ్మ కపాలం నుంచి బయలుదేరి శిరస్సున ఉన్న బాలచంద్రుని వాడిపోయేటట్లు చేస్తున్నాయి. నవరంధ్రాలను బంధించి, మనస్సుని స్వాధీన పరచుకుని, క్షేత్రజ్ఞులైన జ్ఞానులు ఎవరిని తెలుసుకుంటారో, అట్టి తనలో తననే సాక్షాత్కరింపజేసుకుంటూ, మనస్సు చేత కూడా పొందలేనివాడైన శంకరుని సమీపించాడు మన్మధుడు. స్థాణువైన శివుణ్ణి చూసి, చేతిలోవిల్లు జారిపోతూ భయం ముప్పిరిగొన్న మదనునికి ఆవేళ ధైర్యం చెప్తున్నట్లుగా పార్వతీదేవి తన సఖులతో అక్కడకి వచ్చింది. సర్వాగసౌందర్యరాశి

అయిన ఆ అగజను చూస్తూ, శివుని జయించేందుకు తగిన బలం లభించిందని పొంగిపోతూ కార్యసిద్ధి కోసం ముందుకి నడిచాడు మన్మథుడు.

తగిన సమయమాసన్నమైనదనుకుంటూ సమాధిని సడలించాడు ఈశ్వరుడు. అది గమనించిన నందీశ్వరుడు సన్నిధిలో నిలిచి నమస్కరించి, పార్వతీదేవి రాకను తెలియజేసాడు. కనుసైగతోనే తన సమ్మతిని తెలిపే పరమ శివుని చెంతకు వచ్చింది పార్వతీదేవి. నల్లని ముంగురుల నడుమ ఉంచుకున్న కొత్త కొండగోగు పువ్వు జారేటట్లు, చెవి సందున ఉంచిన చిగురాకు కిందపడేట్లు వంగి నమస్కరించింది. అధరాలపై చిరు దరహాసం విరియగా 'అన్యకాంతను ఎరుగని పెనిమిటిని పొందెదవు గాక!' అని ఆశీర్వదించాడు కపర్ది. మందాకినీ నదిలో పూచిన పద్మాలలోని గింజలు ఎండబెట్టి సమకూర్చిన అక్షమాలను, తపశ్శాలి అయిన స్వామికి, ఎర్రని అరచేతులతో పార్వతీదేవి సమర్పించింది. అర్థుల కోర్కెను ప్రీతితో తీర్చే పరమశివుడు ఆ మాలను స్వీకరించేందుకు సిద్ధపడుతూ, చంద్రోదయవేళ పొంగే సముద్రుని వలె, దొండపండు వంటి క్రింది పెదవితో అందాలొలికే పార్వతి ముఖం వంక ప్రేమగా చూశాడు. ఆ చూపుతో తనువంతా పులకరించగా శృంగార రసాధిదేవతలా ఉన్న పార్వతి సిగ్గుతో మొహం ప్రక్కకు తిప్పుకుంది. తగిన అదను ఇదేనని సార్థకమైన సమ్మోహనాస్త్రాన్ని వింట సంధించే మదనుని, సర్వజ్ఞుడైన సర్వేశ్వరుడు కడగంటి చూపుతో కనుగొన్నాడు. "ఎవరైతే నీకిష్టం లేకుండా, జరామరణాది భీతులై మోక్షమార్గాన్ని కోరుతున్నారో, అలాంటివారిని అతివల క్రీగంటి చూపులతో కట్టిపడేటట్లు చేస్తాను అలాటిది నాకిది ఒక లెక్కా! మృదువైన పుష్పబాణాలతో పినాకపాణి అయిన హరుని నిబ్బరం నాశనం చేస్తాను" అని అహంకారంతో ఇంద్రునితో పలికిన మదనుని పలుకులు విశ్వవ్యాపి అయిన స్వామి చెవుల్లో మారుమ్రోగాయి. యాచించేవాళ్ళు దేవతలు, పని ముల్లోకాల వారిది అన్న ఇంద్రుని వాక్యాలు కూడా మనస్సులో కదిలినా..........

వినయ భయభక్తులెదలోన బెనగొనంగ ప్రియ భావనతో సేవించి మహాత్ముల మనస్సులను జయించాలిగాని అహంకరిస్తే అధఃపతనం తప్పదు" అనే సత్యం ఈ మదనుని ద్వారా లోకానికి వెల్లడికావాలి" అనుకుంటూ అహంకారం నిండిన మన్మథుని తనువును మూడోకన్ను తెరిచి భస్మం చేశాడు. ఆ క్షణానే ప్రమథగణాలతో అంతర్థానమయ్యాడు ఈశ్వరుడు. ఉత్తముడైన తండ్రి అభిలాష, తన శరీర సౌందర్యం వ్యర్థమైనాయనుకొని బాధపడుతూ ఇంటికి మరలిపోయింది పార్వతీదేవి.

-సశేషం

# మన సాధన ఎందుకు ఫలించటం లేదు?

(గతసంచిక తరువాయి)

-వెంకట రమణ ప్రసాద్

అనగా యజ్ఞ దాన తపః కర్మలు 'ఫలాభిసంధి లేని బుద్ధిమంతులను పావనులుగా చేయును' అని ప్రత్యేకముగ చెప్పిరి. అట్లు ఫలమును కోరక చేయబడెడి యజ్ఞదానతపములు పూర్వజన్మముల యందు సంతరించుకొన్న పాపములను నశింపజేయును. ఎప్పుడు పాపములు నశించునో అప్పుడు చిత్తము శుద్ధమై, సాధన చతుష్టయమును సాధించుటకు కావలసిన సామర్ధ్యము కలిగి, శ్రవణాదులకు యోగ్యత కలుగును.

శ్రవణాదుల వలన తత్వజ్ఞానము కలుగును. జ్ఞానము కలుగుటకు సాధన చతుష్టయము అంతరంగ సాధన మనియు, యజ్ఞ దాన తపస్సులు బహిరంగ సాధనమనియు చెప్పబడుచున్నది. కనుక శ్రవణాదులకు యోగ్యత లేనివారు యజ్ఞ దాన తపములాచరించి, శ్రవణాదుల కవసరమైన చిత్తశుద్ధిని సాధించి మోక్షమును పొందవచ్చునని శాస్త్ర నిర్ణయము.

"వేదములలో చెప్పిన యజ్ఞములాచరించుటకు మిక్కుటమైన అంగబలము, అర్ధబలము కావలెను. అవి నేను చేయగలనా?" అని సామాన్య సాధకుడు సంశయింప వలసిన అవసరము లేదు. మోక్షలాభమును కోరు సాధకులు వేదములలో చెప్పబడిన యజ్ఞములను చేయనక్కరలేదు. నిజమునకు అట్టి యజ్ఞములను చేయరాదని కూడ శ్రుతి నిషేధించినది.

**ప్లవా హ్యేతే అదృఢా యజ్ఞరూపా**
**అష్టా దశోక్త మవరం యేషు కర్మ**
**ఏతచ్ఛ్రేయోభినందంతి మూఢా**
**జరా మృత్యుస్తే పునరేవాపి యన్తి**

(ముండక. 1-2-7)

అని ఉపనిషత్తు విధించుచున్నది. యజ్ఞపత్ని, యజమానులిరువురును పదునారుగురు ఋత్విక్కులును చేరి పదునెనిమిది మందితో శరీరాయాసము చేతను, ధన వ్యయముచేతను సాధ్యమగునదియును, స్వల్ప ఫలమును కలుగజేయునదియునుస నికృష్టమగు కర్మయే స్వరూపముగా గలదియు నగు యజ్ఞమును శ్రేయస్సాధనముగా నమ్మిన మూఢులు మాటిమాటికి

పునరావృత్తమగుచున్న జన్మ జరామృత్యురూపమగు సంసారమును తరింపనేర" రని ముండకోపనిషత్తు స్పష్టముగా దెలియజేయుచున్నది.

భగవద్గీత యందు యజ్ఞ శబ్దమునకు విభిన్నములైన యర్ధములు చెప్పబడినవి. పితృయజ్ఞమనగా పితృదేవతలకు శ్రాద్ధ తర్పణాదులు చేయుట. దేవ యజ్ఞమనగా దేవతలను పూజించుట. బ్రహ్మయజ్ఞమనగా వేదశాస్త్రములను చదువుట. పశుయజ్ఞమనగా పశుపక్ష్యాదుల కాహారముగా బలినొసంగుట. మనుష్యయజ్ఞమనగా అతిథ్యభ్యాగతులను సత్కరించుట.

ఈ పంచవిధ యజ్ఞములలోను అధ్యాత్మ సాధకునకు వలసినది బ్రహ్మయజ్ఞమే. పురాణములను, వేదాంత గ్రంధములను చదువుట, ఇతరులకు వినిపించుట, తాను వినుట, గీతా, భాగవతాది సప్తాహములను నిర్వహించుట బ్రహ్మయజ్ఞమనిపించు కొనును. యజ్ఞములలో శ్రేష్ఠమగు యజ్ఞమిదే.

అటులనే 'యజ్ఞానాం జపయజ్ఞోస్మి' అని భగవానుడు స్వయముగా ప్రకటించుకొన్నాడు. గురూపదిష్టమైన మంత్రమునో, శ్రీరామతారకము, శివపంచాక్షరి మొదలైన వానిలో దేనినైనను స్వీకరించి నిరంతరము జపించుట జపయజ్ఞము.

**'జపతో నాస్తి పాతకః'** అని చెప్పబడుటచే జపము వలన పాతకములు నశించి, చిత్తశుద్ధి కలిగి శ్రవణాదులొనర్చుటకు కావలసిన యోగ్యత సిద్ధించును. మనుస్సు నిర్మలమగుటచే నానాటికి ఏకాగ్రత పెరిగి అనుష్ఠానమునకు కావలసిన మనస్థితి ఏర్పడును.

-సశేషం

ఒక క్రైస్తవ మత గురువు గాంధీగారిని చూడటానికి వచ్చాడు. ఆయన టేబిలు మీద భగవద్గీత దానిపై బైబిలు ఉన్నాయి. మత గురువు "చూశారా! మీ భగవద్గీత మీద మా బైబిలు ఉంది" అన్నాడు.

గాంధీగారు నవ్వుతూ "మీ బైబిలుకు మా భగవద్గీత ఆధారం" అన్నాడు.

# కన్ను మూస్తే

-మేధ

కన్ను తెరిస్తే జననం, కన్ను మూస్తే మరణం. మానవ జీవితం రెప్పపాటే కదా! ఊపిరి ఉన్నంత వరకు అన్నీ కుశలమే. ఈ విషయాన్ని మహాత్ములెంత మంది చెవులో ఇల్లు కట్టుకుని చెప్పినా దానిని గ్రహించినవారు ఎంతమంది అయినా మహాత్ములు తమ ప్రయత్నం కొనసాగిస్తూనే ఉంటారు.

ధనవంతుడైన భక్తుడుండేవాడు. అతనికి బంధుమిత్రులకి, సమాజంలో గౌరవ మర్యాదలకి లోటులేదు. అతనికి తన భార్యా పిల్లలు, బంధువులు, స్నేహితులు చూపే ప్రేమ, ఆదరణ చూసి మురిసిపోయేవాడు. అతని అదృష్టంకొద్దీ కబీర్ గురుత్వం లభించింది. కబీర్‌దాసు అతనికి ఎన్నో పర్యాయాలు "ప్రాపంచిక ప్రేమలు, బంధాలు అంతా మాయ" అని హెచ్చరించాడు. కాని అతనికి కబీర్ చెప్పిన మాటలు రుచికరించలేదు సరికదా "నా భార్య పిల్లలు నేను లేకపోతే ఒక్క క్షణమైనా జీవించలేరు. నా బంధువులు, మిత్రులు నా కోసం ప్రాణత్యాగమైనా చేస్తారు" అని గురుదేవులైన కబీర్‌తో వాదనకు దిగారు.

కబీర్ నవ్వుతూ "అయితే నేనొక ప్రయోగం చేస్తాను. దాని వలన నేను చెప్పింది యదార్థమో కాదో నీవే తెలుసుకుంటావు" అని అన్నారు. నీకొక ఔషధము ఇస్తాను. దాని ప్రభావం వలన నీ దేహం బిగుసుకు పోతుంది. చూసే వారికి నువ్వు మృతి చెందినట్టే ఉంటుంది. కాని నీ మేధా శక్తి మాత్రం యధాతథంగా ఉంటుంది. అన్ని తెలుసుకుంటూనే ఉంటావు. ఈ ప్రయోగం ద్వారా నీ భార్య, పిల్లలు, బంధుమిత్రులు, ఏ రకంగా స్పందిస్తారో తెలుసుకుందాం" అని అన్నాడు. పథకం ప్రకారం శిష్యుడు ఔషధం స్వీకరించాడు. గంట తరువాత శరీరం బిగుసుకుపోయింది. ఇంట్లో కోలహాలం ప్రారంభం అయింది. భార్య పిల్లలు ఏడవసాగారు. ఆ వార్తవిన్న బంధు మిత్రులంతా వచ్చారు.

భార్య రోదిస్తూ, తల నిండా పూలు పెట్టుకుని, నగలు సింగారించుకుని, పదిమందిలో తిరిగే సదవకాశం లేకుండా చేశారే. ఇప్పుడు విధవగా సమాజంలో ఎలా తిరగాలి అని ఆరోపించింది. పిల్లలు ఏడుస్తూ ఇనప్పెట్టి తాళాలు ఎక్కడ పెట్టిందీ చెప్పనేలేదు. మిత్రులందరికి అప్పులిచ్చారు. ఎవరెవరికి ఎంతెంత

ఇచ్చారో చెప్పనేలేదు. పోనీ ఆ పత్రాలు ఎక్కడ పెట్టిందీ చెప్పలేదు అని ఆరోపణ మీద ఆరోపణ చేస్తూనే ఉన్నారు. ఇంక మిత్రులు మాట్లాడుతూ అవసరం వచ్చినప్పుడల్లా డబ్బులిచ్చే బంగారు గుడ్లు పెట్టే కోడి చచ్చిపోయింది అని ఒకరు, వ్యాపారంలో పోటీ లేకుండా పోయిందని మరొకరు ఇలా కొనసాగింది. అంతా శిష్యుడు వింటూనే ఉన్నాడు. గురుదేవులైన కబీర్ ఒక మూలకూర్చుని నవ్వుకుంటూ గమనిస్తున్నారు.

ఇంతలో సూర్యాస్తమయం కాసాగింది. భార్యా, పిల్లలూ అంతా చర్చించుకుంటున్నారు. పోయినవారు తిరిగిరారు కదా! జరుగవలసిన కార్యక్రమం గురించి ఆలోచించండి అనుకుంటున్నారు.

కబీర్‌దాసు నవ్వుతూ "తెలిసిందా? బంధు మిత్రులు, భార్య పిల్లల తీరు చూశావు కదా! ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఉన్నంత వరకే మానవునికి విలువ నిచ్చేది. అవి ఉన్నప్పుడే మన కర్తవ్యం ఏమిటో గుర్తించి, జనన మరణం లేని స్థితిని పొందాలి. మనిషి చస్తే ఏమవుతుందో, ఎంత విలువ నిస్తారో నువ్వు స్వయంగా తెలుసుకున్నావు కదా!" అని శిష్యుణ్ణి హెచ్చరించారు. *

వంటవాడు వంకాయకూర అద్భుతంగా చేశాడు. బీర్బల్ "వంకాయ వంటి కూరే లేదు" అన్నాడు అక్బరుతో. మెచ్చుకోవడంచూసిన వంటవాడు రోజూ వంకాయకూరే వండటం మొదలెట్టాడు. ఇది బీర్బల్‌కి భరింపరానిది ఆయింది.

"వంకాయ గురించి ఇప్పుడు నీ అభిప్రాయం ఏమిటి" అని అక్బర్ బీర్బల్‌ను అడిగాడు.

"వట్టి పనికిమాలినది. అందుకే వైద్యులు దీన్ని మొదట నిషేధిస్తారు" అన్నాడు బీర్బల్.

"అదేమిటయ్యా! మొన్ననే కదా, అద్భుతమైన వంటకం ఇది అని, ఈవేళ ఇది పనికిమాలినది అంటావు!" అని ఆశ్చర్యంగా అడిగాడు అక్బర్.

"ప్రభూ! నేను తమకు కొలువు చేస్తున్నానుగానీ, ఈ వంకాయకు కాదుకదా!" అన్నాడు బీర్బల్.

# నేను అర్థం చేసుకున్న (భక్తి యోగం)

- కొండ వెంకటరాజు
B.E (cryo engineer) EIL

**ఏవం** - ఈ విధంగా పూర్వ అధ్యాయంలో (11 అధ్యాయంలో) చెప్పిన విధంగా అని భక్తియోగం మొదలు అవుతుంది. ఈ 11వ అధ్యాయంలో చివరి శ్లోకంలో భగవంతుడు చెప్పిన దానిని మనం గుర్తు (మననం) చేసుకోవలసిన అవసరం ఉంది.

**మత్కర్మకృత్** - నాకు ప్రీతికరములైన కర్మలను చేయువాడు,
**మత్పరమో** - నన్నే పరమావధిగా నెంచుకున్న భక్తుడు,
**సంగవర్జితః** సంగమాలని (మోహ, క్రోధ, మాత్సరాలను) వదిలినవారు,
**మద్భక్తః** - అట్టి భక్తుడు, మామేతి - నన్నే పొందుతున్నాడు.

అర్జునుడు అడుగుతున్నాడు నిన్ను సాకారంగా కొలుస్తున్న భక్తులు ఇష్టులా లేక నిరాకార బ్రహ్మగా కొలుస్తున్న భక్తులు ఇష్టులా, ఎవరంటే నీకు ఎక్కువ ఇష్టులు?

కృష్ణభగవానుడు ఎవరు ఇష్టులు అని చెప్పకుండా, ఎల్లప్పుడూ నా యందు మనస్సు నిలిపి, మిక్కిలి శ్రద్ధతో నన్ను ఉపాసించుచున్నారో, అట్టివారు నాకు సమ్మతులు అని అంటున్నారు. బ్రహ్మ (నిర్గుణ) ఉపాసన మిక్కిలి ప్రయాసతో కూడుకుంది. అయితే సగుణోపాసన చేస్తూ అంతఃకరణ శుద్ధి కలిగిన వారికి నిర్గుణోపాసన అంత కష్టతరం కాదు.

సాకారోపాసనలో విగ్రహారాధన ఒకటి. గురుస్వరూపాన్ని లేదా మనకిష్టమైన భగవత్స్వరూపాన్ని గాని శ్రద్ధతో సదా ధ్యానం (మానసపూజ) చేయటం రెండవది. నిరాకారోపాసనలో చరాచర ప్రపంచం అంతా నిండి ఉన్న జ్ఞాన రూపుణ్ణి అరాధాంచటం ఒకటి. అన్నిటిలో ఉన్న వాడగుటచేతనే ఆత్మలో కూడ ప్రకాశిస్తున్న జ్ఞాన రూపుణ్ణి ఆరాధించటం రెండవది. భగవంతునికి అన్యముగా ఒక తృణమైనను లేదని భావనతో ఆ ప్రభువుని కొలచుట ముడవది. ఈ అయిదు పద్ధతులు ఒకదానికంటె ఒకటి వేయిరెట్లు సాధనకు అధికమైన శ్రద్ధ శ్రమలతో కూడుకున్నది. ఇంద్రియములను విషయముల మీదకి పోకుండా నిగ్రహించి, అన్ని కాలములందు భక్తి, శ్రద్ధలతో,

సకల భూతములను ప్రేమతో చూస్తూ నన్ను ఉపాసిస్తున్నారో అటువంటివారు ఎవరైనా సరే నన్ను పొందగలరు.

భగవంతుడు నాలుగు అంతస్తులుగా నన్ను పొందవచ్చు అని వివరించుతున్నారు. ఇప్పుడు వాటిని తెలుసుకుందాం.

1. మనస్సును నా యందు ఉంచు, బుద్ధిని నాయందే నిలుపుము. అట్లు చేసితివేని నన్నే పొందగలవు. ఇది అన్నింటిలోకి పై అంతస్తు.

2. ఈ విధంగా మనస్సు నిలవకపోతే, అభ్యాసంతో ఎట్లైనా అట్టి స్థితిని పొందటానికి ప్రయత్నం చెయ్యి.ఇది ఫస్ట్‌ఫ్లోర్ లాంటిది. ఈ అభ్యాసాన్ని ఎవిధంగా చేయాలి అనే దాన్ని గురించి 6వ అధ్యాయం (ధ్యానయోగం)లో పలువివరాలున్నాయి. ఒకేసరి నమిలి మింగేద్దాం అనుకుంటే తలపోటేగాని, మనస్సు నిలవదు. కొంచెం కొంచెంగా చేస్తూపోతే కొన్నాళ్ళికిఫలితం కనబడుతుంది అని చెప్పటం అయింది. మనస్సును ఏకాగ్రత అభ్యాసంతోపాటు వైరాగ్య అభ్యాసం కూడా జోడిస్తే ఫలితం చాలా తొందరగా కనబడుతుంది.

3. ఇలా అభ్యాసం చేయటం కూడా కష్టతరం అనుకుంటే, నాకు ప్రీతికరమైన పనులు మాత్రమే చేయుము. ఇలాగైనా నన్ను పొందగలవు. ఇది గ్రౌండుఫ్లోర్ లాంటిది. ఈ అధ్యాయంలోనే 35రకాల ప్రీతికరములైన పనులు భగవానుడు చెప్పియున్నాడు. మొత్తం భగవద్గీతలో చాలా చోట్ల పలు ప్రీతికరమైన పనులను సూచించారు.

4. ఇలా కూడా చేయటం కష్టంగా ఉంటే, అన్నీ నన్నే పరమావధిగా పెట్టుకొని చేసుకో. కాని వాటి ఫలాన్ని మాత్రం నాకు వదిలివేయి. ఆయన సృష్టించిన ప్రపంచంలో ఆయన వస్తువులకు మనం ట్రస్టీలమేగాని, హక్కుదారులంగాదు అనే స్పృహతో మెలగగలగాలి. ఈ విధంగా అయినా నన్ను పొందగలవు. ఇది పైన చెప్పబడిన అంతస్తులకు పునాది లాంటిది.

పునాది గట్టిగా ఉంటే ఆ పై అంతస్థులు కూడా బాగా నిలబడతాయి. ఇక్కడ మనం ఈశావాశ్యోపనిషత్‌లోని రెండవ శ్లోకం గమనించాలి. కర్తవ్యాలని నిర్వహించుతూ మాత్రమే నూరు సంవత్సరాలు జీవించాలని ఆశించు. ఇలా చేస్తే మామూలు భక్తులకు కర్మబంధాలు (సంచితాలు) ఏర్పడవు.

అద్వేష్టా సర్వభూతానాం అంటూ 13వ శ్లోకం నుండి మొదలుకొని 19వ శ్లోకం వరకు 35రకాలైన ప్రీతికరములైన వారి గురించి (పనులు గురించి)

చెప్పియున్నారు. వీటిలో కొన్ని ద్వంద్వాలు కూడా ఉన్నాయి. (మంచి, చెడు). మంచి జరిగితే ఉప్పొంగిపోరాదు. అలాగే చెడు జరిగితే కృంగిపోరాదు. అలాంటి వాడే భగవంతుడికిష్టుడు. అలాగే ఈ క్రింద ఉదహరించిన ద్వంద్వాలని కూడా మనం అర్థం చేసుకుని సమభావంతో మెలగాలి.

రాగం-ద్వేషం, నిందా-స్తుతి, శుభం-అశుభం, లాభం-నష్టం, మానం-అవమానం, రుచి-అరుచి, ఇష్టం-అయిష్టం, శీతలం-ఉష్ణం, మంచి-చెడు, మోహం-శోకం, చీకటి-వెలుగు మొదలగునవి.

ఈ అధ్యాయంలో స్వామి పలుచోట్ల (మే ప్రియః) అని సంబోధించారు. అంటే నాకు ఇష్టుడు అని అర్థం. అధ్యాయం చివరిలో **అతీవమేప్రియః** అని సంబోధించారు. అంటే మిక్కిలి ఇష్టుడు అని స్వామి అంటున్నారు. భక్తులు చాలామంది భగవంతుడు మాకు చాలా ఇష్టుడు అని తలపోస్తూ ఉంటారు. కాని భగవంతుడు మనల్ని ఇష్టంగా చూస్తున్నాడా లేదా అనేది అసలు విషయం. ఇలా (భక్తియోగంలో చెప్పిన విధంగా) సాధన చేస్తే మనం ఆయన్ని తెలుసుకోగలుగుతాము.

గీతాధ్యానం చేసిన ప్రతిసారి మనం గీతామహాత్యం పారాయణ చేయవలసిన అవసరం ఉంది. కావున మహాత్మ్యం గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

ఎచ్చట గీతాపారాయణం జరుగుతుందో అక్కడ సమస్త దేవతలు, ఋషులు, గోపాలురు, గోపికలు, నారదుడు మున్నగువారు సహాయార్థం ఆస్థలంలో నెలకొని ఉంటారు. ఎక్కడ పఠనం, పాఠనం, శ్రవణం జరుగుతుందో అక్కడ కృష్ణభగవానుడు పీఠం వేసుకుని కుర్చుని ఉంటాడు. ఎవరు నిరంతరము గీతాభ్యాసము చేయుచుందురో అట్టివారు ప్రారబ్ధ కర్మల నుండి కూడా తప్పించుకొంటారు. ఎవరైతే శిశుహత్య, గోవధ వంటి మహాపాపములు చేసి ఉంటారో వారు కూడా అలాంటి పాపాల నుండి విముక్తి చెందుతారు.

గీతని చదివిన ప్రతిసారి గీతామహాత్మ్యము చదువవలెను. ఒక మంచి డాక్టరును జనులందరూ స్తుతించుట వలన ఆ డాక్టరు యొక్క చేతి చలవ (మహాత్మ్యం) మరిన్ని జనులకు తెలియును. గీతామహాత్మ్యం మరల మరల మనం చదవటం వలన మనకు మరింత (గీతాపఠనం) చదవటానికి శ్రద్ధ కలుగుతుంది. *

# సమర్థ సద్గురు

(యాజమాన్యం తదితర వివరాలు)

Form -4 ( 8వ నిబంధన ప్రకారము)

| | |
|---|---|
| ప్రచురణ స్థలం | - శ్రీ కాశీ గార్డెన్స్, నంబూరు R.S |
| ఎంత కాలానికి ఒకసారి | - మాస పత్రిక |
| ముద్రాపకుని పేరు | - సి.వి. రమణబాబు |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.No 3-499 శ్రీకాళీగార్డెన్స్,నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| సంపాదకుని పేరు | - డి.జె.బి.కె. లాల్. |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | -D.No 3-499 శ్రీ కాళీగార్డెన్స్,నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| పత్రిక యజమానులు | - యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ ఛారిటబుల్ ట్రస్ట్ D.No 3-499 శ్రీకాళీగార్డెన్స్,నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |

పై విషయములు నాకు తెలిసినంత వరకు వాస్తవములని తెలియ చేస్తున్నాము.

శ్రీ కాళీ గార్డెన్స్ ( సం) సి.వి. రమణబాబు

ది. 31.3.2011 పబ్లిషర్




(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

కృష్ణుడికి ఆ సమాధానం నచ్చలేదు. బలరామునితో, ఉద్ధవునితో, తదితర గోపబాలురను సమావేశపరిచి కృష్ణుడు "గోకులం మనది, జనపదం మనది, గోరసం మనది. దానిని ఒక శక్తిశాలి అయినవాడు తీసుకుపోతుంటే మనం ఏమీ చెయ్యలేకపోతున్నాం అంటే మనం పిరికి పందలమా.... మన ఆవులు ఇచ్చే గోసమృద్ధి మనకే దక్కాలి. మనం దీనిని ఆపాలి" విశదంగా వారందరికి తెలియ పరిచాడు..

వారిలో ఒకడు ఈ ఒప్పందంలోని లోటుపాట్లను తెలియజేస్తూ ఇలా అన్నాడు "మనందరం ఏకమైనా కూడా గోకులంలోని స్త్రీల సహకారం లేనిదే మనం అనుకొన్నది సాధించలేం.... ఎందుకంటే వారు కనక కంస మందిరానికి గోరసాన్ని సరిగ్గా అందించలేకపోతే మధురలోని యాదవులకు పట్టిన గతే నందునికి, గోకుల వాసులకు పడుతుంది. చూశారుగా మధురలోని యాదవులను జైలుపాలు చేశారు. ఉగ్రసేనుడు, వసుదేవునితో సహా వారందరూ జైలులో మగ్గుతున్నారు!"

"అయితే మనం గోపస్త్రీలకు కూడా విషయము చెబుదాం. వారికి ఏది ధర్మమో,ఏది న్యాయమో తెలియచేద్దాం...." అన్నాడు కృష్ణుడు.

వారందరిని ఏకత్రితం చేసి మనం చెబితే వారు వినరు కాబట్టి ఒక తేజస్వి అయిన గోపకన్యను మనవైపు తిప్పుకొంటే ఆమె ద్వారా మనం అందరినీ సమావేశపరిచి ఏదిధర్మమో, ఏది అన్యాయమో వారికి తెలియచేస్తే వారు అర్థం చేసుకుంటారు.

'అటువంటి తేజస్వి అయిన గోపకన్య ఎవరు' కృష్ణుడు ఆలోచనలో పడ్డాడు. వ్రజపురిలో అగ్రగామి అయిన వృషభానుని పుత్రిక రాధ... "రాధా!" కృష్ణుడు చిరునవ్వు నవ్వాడు ఆమె వరిష్ఠ గోపరాయని పత్ని..."

తాను కాళియనాగు గర్వం అణచి తన చేతిలో గిలగిలలాడుతున్న దాని భయంకరాకృతిని చూసి భయంతో ఆశ్చర్యంతో ఉన్న గోకుల వాసుల మధ్య ఉన్న రాధ కృష్ణునికి గుర్తుకు వచ్చింది. అందరి కళ్ళలోను భయాందోళనల మిశ్రితభావాలు కనపడుతుంటే, ఈ చమత్కారాన్ని చూసిన రాధ కనులలో శ్రద్ధ తొణికిసలాడింది. శ్రద్ధాపూరితమైన చూపులను కృష్ణునిపై కేంద్రీకరించింది. కృష్ణునికి ఆ చూపులు గుర్తుకి వచ్చాయి.... ఆ భావభరితమైన కనులు... కృష్ణుడు అంతకుముందు చూచి ఉండలేదు. రాధ కనుక తను సంకల్పించిన ఈ కార్యానికి సహాయం చేస్తే...

అప్పుడు గోకులంలోని జనపదమే కాదు, మధురలోని గణతంత్రం స్వతంత్రతను కూడా పునస్థాపితం చేయడానికి వీలు అవుతుంది. రాధ గోకులంలోని గోపస్త్రీలనందరినీ సమావేశపరచి కృష్ణుని నిర్భయత గురించి చెప్పి, అతని ధర్మ సమ్మతమైన సందేశాన్ని వారికి అందజేస్తే కార్యం సఫలమైనట్లే. గోపపురుషుల త్యాగం ధర్మబద్ధమైన సంఘర్షణ వల్ల తాత్కాలిక లాభం కలిగినా, సమాజాన్ని పూర్తిగా భయరహితం చేయటం గోపస్త్రీల ద్వారానే సంభవం అవుతుంది. స్త్రీలందరికి ఈ సందేశాన్ని అంద చేయటానికి రాధ ఒక్కతే సమర్థవంతురాలు. ఆనాడు కాళీయుని మథించిననాడు... రాధ శ్రద్ధాపూరితమైన కనులతో కృష్ణుని తదేకంగా చూచిందో ఆ శ్రద్ధ ఈ సంఘర్షణకు తోడ్పడగలదు!

రాధను సహాయం కోరాలి అనే సలహా కృష్ణునికి నచ్చింది. తన యోజనను అమలు పరచటంలో ఏ మాత్రం ఆలశ్యం చేయని కృష్ణుడు రాధను కలిసి ఆమెకు తన తలపెట్టిన కార్య వివరాలు స్వయంగా తెలియ చేశాడు.

"రాధా! నీ సహాయ సహకారాలు లేకపోతే ఈ భగీరథ కార్యం పూర్తి కాదు" అన్నాడు కృష్ణుడు.

"కాళీయుని వంచి మహా సమర్థవంతమైన శత్రువును పరాస్తం చేసిన కృష్ణునికి కూడా భగీరథ కార్యం ఉంటుందా?" అని రాధ నవ్వింది. ఆమె హాస్య పూరితమైన నవ్వులో, ఆమె కనులలో తనపై శ్రద్ధా భావన వెల్లివిరుస్తున్నాయి.

"అవును రాధా! శత్రువు ఒకరో ఇద్దరో అయితే వారిని జయించటం అంత కష్టం కాదు. ఈ సమిష్టి కళ్యాణ కార్యం ఒక్క కృష్ణుని వల్లకాదు - అందుకు కృష్ణునికి రాధ అవసరం ఉంది."

"కృష్ణుని వంశి, కృష్ణుని నెమలి పింఛం సర్వ వ్యాపకం కేశవా! రాధ నిమిత్తమాత్రం కాగలిగితే అది నా అహోభాగ్యం!'' ఆ తరువాత మాట్లాడటానికి ఏమీ మిగలలేదు. కృష్ణుడే అందుకని ఇలా అన్నాడు "రాబోయే పున్నమి నాటి రాత్రి కాళింది తీరాన్న గోపీ స్త్రీలను సమావేశపరచి కృష్ణుని సందేశం అందించే కార్యం....''

"రాధ చేస్తుంది...'' రాధ కృష్ణునికి నతమస్తక అయి అన్నది. ఆ సమయంలో గోకులవాసులందరూ కాళింది తటం వద్ద నిలబడ్డారు. కృష్ణుని మురళీరవము అంత మధుర ధ్వనులను పలికిస్తుందని మొదటి సారిగా వారు తెలిసికొన్నారు. గోపీస్త్రీలు ఉత్సాహంతో నాట్యం చేయసాగారు. ఆకాశం నుంచి ప్రవహిస్తున్న శుభ్రజ్యోత్న రెండు సమాంతర ప్రవాహాలుగా భాసిస్తోంది.... కృష్ణుని వేణువు, కృష్ణుని నెమలి పింఛం సర్వవ్యాపకం అని రాధ అన్నమాట సత్యమే... మురళి స్వరం అయితే రాధ భావం అన్న కృష్ణుని మాట కూడా అంతే సత్యం! ప్రతిగోపీ కన్య కృష్ణుని స్వరంలో స్వరం కలుపుతోంది. ఈ స్వర లహరి అంతటా ప్రతిధ్వనిస్తోంది.

ఉద్ధవుడికి ఆ అద్భుత రాసలీల గుర్తుకువచ్చి ఆ జ్ఞాపకాలలో ఉండిపోయాడు. ఆహా! ఎంతటి గొప్ప ఆర్ష దృష్టి కృష్ణుడిది! జనపదంలోని స్త్రీలలో ధర్మం, నిర్భయత తన మధుర మురళీ స్వరాలద్వారా వారికి అందించక పోయి ఉంటే. అక్రూరునితో కృష్ణుని మధురకు పంపటానికి ససేమిరా ఒప్పుకొనేవారు కాదు. కృష్ణుడు మధురకు వెళ్ళి ఉండకపోతే...

ఉద్ధవుడు కనులు మూసుకున్నాడు... అప్పుడు కాళింది ప్రవాహం ఈ విధంగా ఉండి ఉండేది కాదు! ఎత్తైన ఆ గోవర్ధన పర్వతం ఇంత ఉన్నతంగా ఉండి ఉండేదికాదు. యమలార్జున విశాల వృక్షం ఈనాడు కూడా మార్గ మధ్యంలో ఉండేది. అధర్మ చక్రం గోకులం నుంచి మధుర మార్గంలో తిరుగుతూ ఉండేది.

-సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL